# ద్రౌపది

## (పాంచరాత్రం)

894.8273
VEN

వి.ఆర్. నార్ల

C.I

A0 UA10418124

ద్రౌపది: స్త్రీ జాతి చిత్తమెరిగి ప్రవర్తించడం!

ధర్మరాజు: ఔనౌను! లేకపోతే ప్రతి గృహమొక కురుక్షేత్రమౌతుంది!

ద్రౌపది : (నవ్వి) ఆ ప్రమాదం తప్పాలంటే మాటలతో నన్ను మరపించక, తిరిగి రామాయణపఠనం సాగించండి!

ధర్మరాజు: సరే! (పుస్తకం చేతిలోకి తీసుకొని, చదవడం మొదలు పెడతాడు)
స్యార్వమానా తు రామేణ మైథిలీ జనకాత్మజా,
వనవాస నిమిత్తాయ భర్తార మిది మబ్రవీత్
సా తముత్తమ సంలిగ్నా సీతా విపుల షక్షసమ్,
ప్రణయాచ్చాభిమానా చ్చ పరిచిక్షేప రాసువమ్
కిం త్వా మన్యత వైదేహః పితామే మిథిలాధిపః,
రామ! జామాతరం ప్రావ్యస్త్రీయం పురుష నిగ్రహమ్.
అనృతం బత లోకో యమజ్ఞానాద్యద్ది షక్ష్యతి,
తేజో నాస్తి వరం ....

ద్రౌపది: వరసగా అలా చదువుకుపోతే, నాకేమి తెలుస్తుంది? దయచేసి టీకా తాత్పర్యాలు చెప్పండి!

ధర్మరాజు: చెప్పక తప్పదా? సరే విను "తన ప్రియుడు బ్రతిమాలుతున్నా వినక, అరణ్యవాసాన్ని గురించే మాట్లాడగోరి, సీత దన్ను రాముడు వెంట దోడ్కొని పోనిచ్చగించ నందుకు మిక్కిలి చింతనొంది, ప్రేమచేతను, గర్వము చేతను విరివి రొమ్ముగల రాముని ఈ రీతిగా నిందింపదొడ గింది 'రామా! మిథిలాపతియైన నా తండ్రి జనక మహారాజు పురుష రూపంలో వున్న స్త్రీని నిన్ను అల్లునిగా తెచ్చుకొన్నట్టు తెలుసుకుంటే ఏమనుకుంటాడో! ఓరామా! .......

ద్రౌపది: సీత ఇంత పరుషంగా మాట్లాడిందా? మనస్సుకు నొప్పి కలిగి నప్పుడు భర్తపై ఎవరైనా కసురుకుంటారు గాని, ఇంతగా నోరు పారవేసుకుం టారా?

ధర్మరాజు: భర్తను దూషించినా లలిత లలితంగా, మధుర మధురంగా దూషించా లన్న మాట!

ద్రౌపది: (నవ్వి) అంతటితోనైనా సీత తన తిట్లను కట్టిపెట్టిందా? ఆ రాముని మనస్సును - పాపం! - మరింతగా నొప్పిస్తూపోయిందా?

ధర్మరాజు: నొప్పించకుండా తిట్టడం నీవలె అందరు భార్యలకు చేతకావద్దా?

ద్రౌపది: నొప్పిలేకుండా తిట్లు తినడం రాముని వలె అందరు భర్తలకుకూడా చేతకాదులెండి! (తిరిగి ద్రౌపది నవ్వు; ధర్మరాజు చిరునవ్వు)

ద్రౌపది: మననవ్వులతో కథ ముందుకు సాగడం లేదు. దయచేసి, చదవండి!

ధర్మరాజు: "ఓ రామా! మిథిలా పురాన్ని పాలించే నా తండ్రి జనకమహారాజు......"

ద్రౌపది: మాటి మాటికి జనక మహారాజు ప్రసక్తి తెస్తుంది దేనికండీ? దానొక మహారాజు పుత్రికైతే, రాముడు మరొక మహారాజుకు పుత్రుడు కాడా?

ధర్మరాజు: ద్రుపద మహారాజు కూర్మి పుత్రికనని మాకు అనుక్షణం జ్ఞాపకం చేయ డానికి నీవైతే ద్రౌపది పేరునే పెట్టుకున్నావు గదా!

ద్రౌపది: నా నిజనామం కృష్ణ.

ధర్మరాజు: కాని, ఆబాల్యంగా నీ ప్రసిద్ధనామం ద్రౌపదే!

ద్రౌపది: పుట్టుకతోనే తమ ప్రసిద్ధనామం ధర్మరాజులైనట్టు కాబోలు! (ద్రౌపది నవ్వు; ధర్మరాజు చిరునవ్వు)

ధర్మరాజు: సీత దూషణ వాక్యాలను నీవింకా వినగోరుతున్నావా?

ద్రౌపది: వినిపించడానికి తమకు సంకోచం లేకపోతే!

ధర్మరాజు: మధ్య నాకు సంకోచం దేనికి?

ద్రౌపది: సీత నుంచి నేనెక్కడ పాఠాలు నేర్చుకు పోతానో అని! (మరల ద్రౌపది నవ్వు; ధర్మరాజు చిరునవ్వు. ధర్మరాజు తిరిగి చదవడం ప్రారంభిస్తాడు.)

ధర్మరాజు: కిం త్వా మన్యత వైదేహః పితాయే మిదిలాధిపః
రామ! జామాతరం ప్రాప్యప్రియం పురుష నిగ్రహం.
అన్నృతం బతలోకోయ మజ్ఞానా ద్యద్ధి వక్ష్యతి,
తేజో నాస్తి పరంరామే తపతీవ దివాకరే.
కిం హి కృత్యా నిషణ్ణస్యం కుతోనాభయమస్తీతే,
య త్వత్యక్తు కామస్త్వం మా మనన్య పరాయణామ్.
"మిథిలా పురాన్ని పాలించే నా తండ్రి జనక మహారాజు, భార్యను కాపాడుకోలేక, ఇచ్చట విడిచి, అడవులకు వెడుతున్న నీ సంగతి విని, నా అల్లుడు స్త్రీయే కాని, పురుషుడు కాదు; పురుషరూపం దాల్చిన స్త్రీయై నన్ను వంచన చేశాడని విచారిస్తాడు గదా! వెలుగుతున్న సూర్యునిలో ఎట్టి ప్రతాపం వున్నదో అట్టి ప్రతాపం రాముడవైన నీలో కనపడదు. ఈ ప్రజలందరు తెలివితక్కువ తనం వల్ల రాముడు ప్రతాపవంతుడు అంటారేకాని, అదివట్టి బూటకం. ఓ రామా! నీవు ఏ పని చేసి...."

ద్రౌపది: ముందేమో తండ్రిపై పెట్టి నీవు పురుషుడవే కావన్నది. ఇప్పుడు తానై నీకు పౌరుషం లేదంటున్నది. ఏ స్త్రీకైనా ఇంత పౌరుష్యం తగదు!

ధర్మరాజు: సీత సాధారణ స్త్రీ కాదు; ఆమె మహాసాధ్వి, పతివ్రతాశిరోమణి.

ద్రౌపది: అసాధారణ స్త్రీ తన భర్త పట్ల తన కున్న అసాధారణ భక్తి గౌరవాలను అసాధారణ దూషణవాక్కులతో ప్రదర్శిస్తుంది కాబోలు!

ధర్మరాజు: ఏ వాక్కులనైనా వాటిని పలికిన సందర్భాన్ని దృష్టిలో పెట్టుకొని పరిశీలించాలి. వనవాసానికి తన వెంటరావలదని రాముడు చెప్పిన సందర్భంలో భర్త వియోగాన్ని నిమేషమాత్రమైనా భరించలేని జానకి తీవ్రహృదయావేదనవల్ల తీవ్రంగా పలికింది!

ద్రౌపది: ఎంత తీవ్రావేదనలోనైనా భర్తను "నీవు పురుషుడువుకావు; నీకు పౌరుషం లే" దనడం దుస్సహం! రాముడు కాబట్టి సరిపోయింది కాని, మరొక భర్త ఆ మాట లన్న భార్యను నిలువునా చీల్చేవాడు!

ధర్మరాజు: ఆయన క్షమామూర్తి!

ద్రౌపది: ఆక్షమ శూర్పణఖ విషయంలో ఏమైపోయిందో! ఇంత కంటె చాలా స్వల్పానికి ఆమె ముక్కు చెవులను కోయించివేశాడు!

ధర్మరాజు: ఆయన మానవోత్తముడు! ఆయన చర్యలను సాధారణ మానవ ప్రమాణాలతో వితర్కించరాదు.

ద్రౌపది: తమరేమైనా చెప్పండిగాని, నాకేమో సీత నిందలో కొంతైనా నిజం లేకపోతే...

ధర్మరాజు: (ముక్కుపై వేలు వేసుకొంటూ) ఎంత పాపపు మాట!

ద్రౌపది: క్షమించండి! (లేచివెళ్ళి, తాంబూలం పళ్ళెం దగ్గరికి తెచ్చి) మరి నాలుగు ఆకులు వేసుకుంటారా?

ధర్మరాజు: వద్దు!

ద్రౌపది: (ఒక ఆకు మడుపు ధర్మరాజుకు అందిస్తూ) పోనీ, ఇదొక్కటి!

ధర్మరాజు: నాకు వద్దు! నీవు వేసుకో! జానకి......

ద్రౌపది: (ఆకు మడుపును వయ్యారంగా నోట పెట్టుకుంటూ) పోనీ, కాస్త వక్కపొడి వేసుకుంటారా?

ధర్మరాజు: వద్దు. జానకి ఏమన్నా తనకొక కఠిన పరీక్షా సమయంలో దుఃఖపారవశ్యంతోనే అన్నది - ఆసంగతి నీవు గమనించడంలేదు!

ద్రౌపది: ద్యూతంలో తాము నన్నోడిన దానికంటె ఆమెకిది కఠిన పరీక్షా సమయం కాదుగదా! అప్పుడైనా నేను తమనొక్క మాట అన్నానా?

ధర్మరాజు: అప్పుడు నీవు ప్రశంసాపాత్రమైన నిగ్రహాన్నే ప్రదర్శించావు గాని, మరొక సన్నివేశంలో.....

ద్రౌపది: ఏదది?

ధర్మరాజు: విరాటరాజు కొలువుకూటంలో కీచకుడు నిన్ను అవమానించి నప్పుడు.......

ద్రౌపది: అప్పుడైనా వీర విక్రములైన పత్నులు నా రక్షణకు రావడం లేదని విలపించానే తప్ప తమను నిందించలేదే!

ధర్మరాజు: ఎవరన్న మాటలు వారికి జ్ఞాపకం వుండవులే! నేను జూదరినైనందు వల్లనే.....

ద్రౌపది: ఏదో నోరు జారి ఆ ఒక్కమాట అన్నాననుకోండి!

ధర్మరాజు: విరాట సభలో అదొక్కమాటే కావచ్చుగాని, ఆతర్వాత వంటశాలలో నీవన్నమాటలు......

ద్రౌపది: అవి తమకెలా తెలిశాయి?

ధర్మరాజు: నీవు దాచిపెట్టినంత మాత్రాన తెలియకుండా వుంటాయా?

ద్రౌపది: క్షమించండి. రెండవ సారి పేరోలగంలో ఘోరావమానం జరిగే సరికి భరించలేక ఏవో వదరి వుండాలి.

ధర్మరాజు: సీతకు ఇది కూడా అట్టి సన్నివేశమే!

ద్రౌపది: ఇవి ఒకే విధమైన సన్నివేశాలంటే- మన్నించాని-నేనంగీకరించ లేను.

ధర్మరాజు: పోనీ, ఇవి భిన్న సన్నివేశాలే అనుకో! మితిమీరి సీతాదేవి భర్తను తూల నాడిందే అనుకో! ఏమైనా తాననగోరిన నాలుగు మాటలు ఆయన ముందే అని వేసింది కాని ఆయను చాటున అన్యులతో అనలేదు.

ద్రౌపది: నేను మాత్రం అన్యులతో అన్నానా? మన అజ్ఞాతవాసానికి భంగం కలగకుండా అప్పటిలో తమను దర్శించడానికి వీలు లేకపోబట్టి మన భీమసేనులతో అన్నాను.

ధర్మరాజు: ఎవనితో అంటే నీ మనోభీష్ట మీడేరగలదో అతనితోనే అన్నావు.

ద్రౌపది: యుధిష్ఠరసామ్రాట్టులు మాత్రం తమ పట్టమహిషి మనోభీష్టాలను తీర్చరా!

ధర్మరాజు: ఇప్పటి మాటకేమిలే! కీచక వధలో, దుర్యోధన, దుశ్శాసన సంహారంలో నీ కోర్కెలీడేర్చింది అతడే కాదా?

ద్రౌపది: తమరు శాంత మూర్తులు, ధర్మరూపులు, అజాత శత్రువులు! తమ స్వభావానికి విరుద్ధమైన కోర్కెలు తమనుంచి కోరడం నాకు తగునా?

ధర్మరాజు: నా నుంచి నీవేమి కోరడానికైనా నేనూ జగజ్జెట్టినా! సవ్యసాచినా! అతి రూపసీనా! మహావివేకినా!

ద్రౌపది: అట్టివారందరినుంచి పూజలందుకొంటున్న ధర్మస్వరూపులు! భవబంధనాల నుంచి విముక్తి సాధించే ధర్మోపదేశాన్ని తమ నుంచి పొందుతున్నాను. అంత కంటె నా కేంకావాలి?

ధర్మరాజు: నీ వేమి, తమ్ము లేమి నా పట్ల భక్తి గౌరవాలు చూపు తున్నమాట నిజమే! కాని......

ద్రౌపది: తమ సందేహమేమిటి?

ధర్మరాజు: నా పట్ల మీకు ప్రేమానురాగాలున్నవా అని ఈ మధ్యతరచు వితర్కించు కుంటున్నాను!

ద్రౌపది: ఈ సందేహం తమ కెందుకు కలగాలి? భక్తి గౌరవాలున్న చోట ప్రేమానురాగాలుండవా?

ధర్మరాజు: అన్ని సందర్భాలలో వుండనక్కర లేదు!

ద్రౌపది: ఆ ధర్మ సూక్ష్మ మేమిటో నాకు తెలియదు.

ధర్మరాజు: వినయం కొద్దీ తెలియదన్నా, నీకా, ధర్మసూక్ష్మాలు తెలియం(ని)ది? ప్రథమ ద్యూతం తర్వాత రాజసభకు తోడ్కొని రావసిందిగా దుర్యో ధనుడు ప్రాతికామిని పంపగా "ధర్మజులు ముందుగా తమ నోడిపోయి పిమ్మట నన్నోడినారా? లేక, ముందు నన్నోడి, తర్వాత తామోడుపడి నారా"? అని నీవు ప్రశ్నించలేదా? నాకే కాక, భీష్మ ద్రోణాదులకైనా ఈ ప్రశ్నతోయలేదు. దానిలో గర్భితమై వున్న ధర్మసూక్ష్మం సామా న్యమైందా?

ద్రౌపది: తమ కృప నా యందుండబట్టే ఆ ప్రశ్న నాకు తోచింది!

ధర్మరాజు: నా కృప!

ద్రౌపది: ఔను! తమ కృప!

ధర్మరాజు: కృపను కాంక్షించేది రాజుల నుంచి, దైవాలనుంచి.

ద్రౌపది: తమరే మాకు రాజులైనా, దైవాలైనా!

ధర్మరాజు: అందువల్లనే కాబోలు, దూరం నుంచి నాకొక నమస్కారం విసిరి పారవేస్తారే తప్ప చెంతకురారు!

ద్రౌపది: మేము తమ చెంత లేమా?

ధర్మరాజు: చెంత నున్నవి శరీరాలే, హృదయాలు కావు!

ద్రౌపది : అదేమిటి? - అలా సెలవిస్తున్నారు!

ధర్మరాజు: ( నిట్టూర్చుతూ) ఊ! సెలవివ్వడం! అది కూడా ఆత్మీయుల పట్ల ప్రయోగించే పదం కాదు; అధికుల పట్ల ప్రయోగించేదే! ఈ విధమైన ఆధిక్యత, ఎంత బాధాకరమో ఇప్పుడిప్పుడే నాకు దెలిసి వస్తున్నది! పుట్టినదాదిగా పెద్దరిక మిచ్చి, ప్రేమానురాగాలకు అందని ఉన్నతాసనం పై నన్ను కూర్చోబెడుతున్నారు!

ద్రౌపది : ఈ పూట తమ మాటలు చిత్రంగా వున్నాయి! తమ పట్ల భక్తి గౌరవాలు చూపడం దోషమా?

ధర్మరాజు: సర్వసాధారణంగా భక్తిలో ప్రేమపాలు కంటే భయం పాలు హెచ్చు. గౌరవం విధిగా అనురాగప్రేరితమైంది కానక్కరలేదు.

ద్రౌపది : అది ఎవరి విషయంలోనైనా కావచ్చునేమో గాని, నా విషయంలో మాత్రం కాదు. తమ రంటే నాకు భక్తిగౌరవలతో పాటు ప్రేమాను రాగాలు కూడా వున్నాయి. ప్రథమ ద్యూత, తర్వాత ధ్రుతరాష్ట్రుడు నన్నొక వరం కోరుకోమనగా, దాస్యం నుంచి తమ విముక్తిని నేను కోరుకోలేదా?

ధర్మరాజు: ఔను, కోరుకున్నావులే! కాని, నాపై ప్రేమతో కాదు, నీ కుమారుని పట్ల అనురాగంతో!

ద్రౌపది : అదేమిటండీ?

ధర్మరాజు: ఏమిటో నీకు తెలియదా? అప్పటి నీ మాటలను ఒక సారి జ్ఞప్తికి తెచ్చుకో! "నా జ్యేష్ట పుత్రుడు ప్రతినింద్యుడు రాకుమారుడుగా జన్మిం చాడు, రాకుమారుడుగా వర్ధిల్లుతున్నాడు. తోటి రాకుమారులు వాడిని దాసపుత్రుడని ఇక గేలి చేయవచ్చు. మాట తలచుకుంటేనే నా గుండె తరుక్కుపోతున్నది. నా చిరంజీవికి ఈ ఘోరావమానం తప్పా లంటే ధర్మజులకు దాస్య విముక్తి కలిగించండి" - ఇవి కావా అప్పటి నీ మాటలు?

ద్రౌపది: శ్రుతసేనుడు, శ్రుతకీర్తి, శతానీకుడు, శ్రుతకర్ముడు కూడా నా పుత్రులే. అయినా, ఆ నలుగురి మాట తలపక, ప్రతివింద్యుని ప్రసక్తిని మాత్రమే నేను తీసుకురావడం వాడు తమ పుత్రుడనే కాదా? తక్కిన నలుగురి పుత్రులపై కంటె మీ పుత్రుని పట్లనే నాకు అధికానురాగం వున్న దనడం, మీ పట్ల అధికప్రేమ కలదని చెప్పడమే కాదా?

ధర్మరాజు: నీ వేమన్నా నాకు తెలుసు - తక్కిన నలుగురిలో కూడా పార్థుని నీవెక్కువగా ప్రేమిస్తావని!

ద్రౌపది : ఎందరు పార్థులైనా ధర్మప్రభువులైన తమ తర్వాతనే!

ధర్మరాజు: అదుగో! తిరిగి "ధర్మప్రభువులు"! దాచాలన్నా, నిజం దాగదులే! నేను నీకు ధర్మప్రభువును కాగా, అతడేమో ప్రేమ మూర్తి!

ద్రౌపది : సీత పలుకుల ప్రభావం నాపై పడలేదు గాని, తమపై పూర్తిగా పడింది! (నవ్వుతుంది)

ధర్మరాజు: అబ్బే! నేను నిన్ను నిందించడం లేదు. మత్స్య యంత్రాన్ని భేధించింది అతడే! మా తల్లి జోక్యం లేకపోతే నీవతనికి మాత్రమే పత్నివై వుండేదానివి.

ద్రౌపది : అప్పుడు తమ పట్టమహిషిని కాగల మహద్భాగ్యం నాకు దక్కి వుండేదా?

ధర్మరాజు: సంతోషం! నన్ను కాకపోయినా నా పదవిని ప్రేమిస్తున్నావు!

ద్రౌపది : (దిగ్గున లేచి, కన్నీటి గొంతుతో) ఎందుకంటే? ఈ పూట నన్నింత క్షోభ పెడుతున్నారు! మీ దేవిక ప్రసక్తినే నెప్పుడైనా తెస్తున్నానా?

ధర్మరాజు: ఆసపత్ని పట్ల నీకు ఈర్ష్య లేకపోవడం కూడా నేనంటే నీకు ప్రేమ లేదనే నిరూపిస్తున్నది.

ద్రౌపది : తమ కొక సతీమణి వుండగా, తమ పెద్ద తమ్ముడు ఇద్దరిని, రెండవ తమ్ముడు ముగ్గురిని కట్టుకున్నారు. తమ చిన్న తమ్ములిద్దరు చెరొకరిని ఏరి, కోరి తెచ్చుకున్నారు. ఈ ఎనిమిది మంది సవతులను గురించి ఆలోచిస్తూ కూర్చుంటే నాకున్న మతి కాస్తా ఎప్పుడో చెడిపోయేది! ఎందుకండీ? అకారణంగా ఈ పూట నన్నింతగా నొప్పించడం! (కన్నీరు పెడుతుంది)

ధర్మరాజు: నవ్వు నుంచి కన్నీళ్ళలోకి ఇంత త్వరగా మారడం నీకే చెల్లు! సరే! - రామాయణ పారాయణం తిరిగి కొనసాగిద్దామా!

ద్రౌపది : వద్దులెండి!

ధర్మరాజు: ఏ! ఇంతలోనే దాని పట్ల అంత వైముఖ్యం?

ద్రౌపది : అదే ఈ పూట తమ మనస్సును అనవసరంగా వికలం చేసింది.

ధర్మరాజు: వినవద్దనుకుంటే నీవు మానుకో. - నేను చదువుకుంటాను.

ద్రౌపది : అయితే, పతి దూషణలో సీతను మించిపోగల ప్రజ్ఞ నాకున్నదని తమకు నిరూపించ వలసి వుంటుంది!

ధర్మరాజు: మంచిది! నిరూపించు! (చదవడానికి పుస్తకాన్ని తిరిగి చేతులలోకి తీసుకుంటాడు.)

ద్రౌపది : (పుస్తకాన్ని చివాలున పెరికి వేసుకుంటూ) సీతా రాముల గోడు మనకు దేనికి? ద్యూతంతో కాసేపు సంతోషంగా కాలక్షేపం చేద్దాం - రండి! (లేచి పాచికలు పెట్టివున్న మరొకబల్ల వద్దకు ఆహ్వానిస్తుంది.)

ధర్మరాజు: (సగం లేచి) ఇప్పుడు ద్యూతం, దేనికిలే! తిరిగి నిన్నోడి పోతానేమో!

ద్రౌపది : అయితే, గెలుచుకునేది మీరేగా! అంతకంటే నాకేం కావాలి! సతిని దిన దినం కొత్తగా గెల్చుకోవడంలో పతికైనా ఎంత ఆనందం లేదు! రండి, స్వామీ! రండి!! చేయిపట్టుకుని ధర్మరాజును ద్రౌపది అవతలికి లాగుతుండగా - తెర)

తెర లేచేసరికి భీముడు ఫలహారాల బంగారు పళ్ళెం ముందు పెట్టుకొని, దాన్ని ఖాళీ చేస్తూ వుంటాడు. ప్రక్కన సువర్ణ కలశం వుంటుంది. మధ్యలో ఒకసారి కలశం నుంచి అతడు మధువును సేవిస్తాడు. ఒకటి, ఒకటిన్నర నిమిషాల తర్వాత మరొక ఫలహారాల పళ్లెంతో ద్రౌపది ప్రవేశిస్తుంది.

ద్రౌపది : అవి చల్లారిపోయినవేమో! వీటిని తీసుకోండి - వేడివేడిగా వున్నాయి. (చేతిలోని కొత్త పళ్ళెం భీముని ముందు పెట్టడానికి పాతదాన్ని తీసి వేయబోతుంది.)

భీముడు :(తన యెదుట వున్న పళ్ళెం ద్రౌపది చేతికి చిక్కకుండా దాన్ని మరింత దగ్గరికి లాక్కుంటూ) కొందరికి వేడి వేడి పదార్థాలు రుచి, కొందరికి చల్లనివి రుచి మనకన్నీ రుచి!

ద్రౌపది : అన్నీ మీకు రుచిగానే వుంటాయా? పాక శాస్త్రంలో ఆ నలమహారాజు తర్వాత అంతటి మహాపండితులైన తాము అనవలసిన మాటేనా ఇది?

భీముడు :ఆకలి రుచి ఎరుగదు; నిద్ర సుఖం ఎరగదు. (కొత్త పళ్ళెం అందు కుంటూ) పళ్ళెం బరువే తప్ప పదార్థాల బరువు కనబడదు!

ద్రౌపది : (నవ్వుతూ) కరవేమీ రాలేదు లెండి! కావాలంటే మరొక పర్యాయం తెస్తాను.

భీముడు :నేను నోరు తెరచి అడిగితే నీవు తెచ్చేది మరొక్క పర్యాయమే అన్న మాట! ఆకలెరిగి, అడగకుండా పెట్టేదే ఆలి!

ద్రౌపది : దేనికైనా మితం వుండాలి. "అతి సర్వత్ర వర్జయేత్!" అన్నారు.

భీముడు :(నాటకంలో వేషధారి వలె) చిలుకా! ఓ రామచిలుకా! నీ చిలక పలుకులతో మమ్మ్మ చికాకు పెట్టవలదు!

ద్రౌపది : (నవ్వి) నావి చిలుక పలుకులా?

భీముడు :(పాత ధోరణిలో) మొలక నవ్వుల ఓ చిలుకా! నీ ముద్దుపెదవులనుండి రావలసినవి చద్దిమాటలుకావు.

ద్రౌపది : (మరింతగా నవ్వి)వేషాలు కట్టడం మనకు కొత్త కాదులెండీ!

భీముడు : రంగురంగుల ఓ చిలుకా! రమ్యమైన ఓ చిలుకా! నీకొరకై ఈ పురుష సింహమొకసారి చీర సింగారించవలసి వచ్చింది!

ద్రౌపది : (చేతిలోని పళ్ళెం భీముని ముందు పెడుతూ, చెంత కూర్చుంటూ) మీ నాటకం మరి చాలు లెండి!

భీముడు : (పక్క కొదుగుతూ) నీకు పుణ్యం వుంటుంది! కాస్త దూరంగా జరిగి కూర్చో! (ముక్కుపై వేలు వేసుకుంటూ) నాకు సరిపడని వాసనేదో వస్తున్నది.

ద్రౌపది : ఏమి వాసన?

భీముడు : పోయిన పన్నెండు నెలలుగా నీవు నేర్చుకు వచ్చిన శ్రీరంగ నీతుల వాసన!

ద్రౌపది : (తిరిగి నవ్వి, ముక్కుపై వేలువేసుకుంటూ) అగ్రజులను ఆక్షేపిస్తున్నారా?

భీముడు : అప్పుడప్పుడు వింటేనే ఆయన శ్రీరంగనీతులను నేను తట్టుకోలేను! ప్రతి నాలుగేళ్ల తర్వాత పన్నెండు నెలలపాటు ఏకధాటిగా వాటిని నీవు ఎలా భరించగలుగుతున్నావో ఆ పరాత్పరుని కెరుక!

ద్రౌపది : (చిరునవ్వుతో) మీ మాటల కేమిలెండి! మనను కాపాడుతున్నది ఆయన ధర్మదీక్షే!

భీముడు : ఔనౌను! దానికి మూడు కోరలుండబట్టి అది మనను కాపాడుతున్నది.

ద్రౌపది : కోరలేమిటి? ధర్మానికి కోరలుంటాయా?

భీముడు : కోరలు లేని ధర్మం బోసినోటి పులి

ద్రౌపది : అయితే, మీ అన్నగారి ధర్మానికున్న మూడు కోరలేవో?

భీముడు : ఒకటి నా గద. రెండవది పార్థుని గాండీవం.

ద్రౌపది : మరి మూడవది?

భీముడు : అది నీ నాల్క!

ద్రౌపది : కోరవలె నా నాల్క కరుకైనదా?

భీముడు : దానికున్న కరుకుతనం ఏ కోరకూ వుండదు.

ద్రౌపది : నా పాడు నాల్కతో మిమ్ము ఎంతగా నొప్పించానో లెండి!

భీముడు : అది ముందు నొప్పించినా, తర్వాత ఒప్పిస్తుంది. అయిదూళ్ళతోనో, ఆయిదిళ్ళతోనో మా అన్నగారు సంతృప్తి పడి, సంధి సేసుకోకుండా ఆకట్టింది అమోఘమైన నీ నాల్కే!

ద్రౌపది : చాల్లెండి - మాటలు నేర్చారు!

భీముడు : నేర్పేవారున్నపుడు నేర్చుకునేవారుండరా?

ద్రౌపది : (చిరునవ్వుతో) మాటలు నేను నేర్పగా, తిండి మా హిడింబి నేర్పిందా?

భీముడు : అది మనకు ఏ గురుశుశ్రూష లేకుండా పుట్టుకతోనే పట్టుబడిన విద్య! (ద్రౌపది నవ్వుతుండగా వ్రేల్చిన ఒక మాంసఖండాన్ని సగం కొరికి, మిగిలిన సగాన్ని ద్రౌపది నోటికి అందించబోతాడు.)

ద్రౌపది : నాకు వద్దు! మీరే తినండి!

భీముడు : అన్నట్టు, నీవింకా మడి విప్పలేదు కాబోలు!

ద్రౌపది : మడేమిటి?

భీముడు : శ్రీరంగనీతుల మడి!

ద్రౌపది : మడులూ లేవు, దడులూ లేవు.

Dr. BRAOU LIBRARY Acc. No N-6720
Class No 894.8272
VEN

భీముడు : లేకపోవడమేమిటి? (ఆమె పైట చెంగును తాకుతూ) మంచు ముద్దలా ఎంత చల్లగా వున్నది! ఇది మడి బట్ట తడి కాదూ? (ద్రౌపది నవ్వు. మరొకసారి ఆమెను వేలితో తాకి, బాధ నటిస్తూ) దడి ముల్లు గుచ్చుకుని - చూడు - రక్తమెలా చిముర్చుతున్నదో!

ద్రౌపది : (విచారాన్ని నటిస్తూ) అయ్యో పాపం! ఎంత ప్రమాదం! ఎంత ప్రమాదం!

భీముడు : జాలి గొలిపేదే నా బ్రతుకు! ఆ నారద మహర్షి ఎక్కడ తగల బడ్డాడో! ఒకసారి దర్శన మిచ్చినా బాగుండును!

ద్రౌపది : ఇప్పుడు ఆయనతో మీకేమి పని!

భీముడు : ఒక విజ్ఞాపన చేసుకోవాలి.

ద్రౌపది : ఏమని?

భీముడు : "మా వంతుల వరస తప్పించి, నాకు మూడవ స్థానమివ్వలేవా, మహా ప్రభో!" అని.

ద్రౌపది : (నవ్వుతూ) వరస తప్పించడం దేనికి?

భీముడు : నా వంతు పన్నెండు నెలలలో మొదటి ఆరు నెలలు శ్రీరంగనీతుల పీడ తప్పడానికి!

ద్రౌపది : (కోపాన్ని నటిస్తూ) మీకు పీడ దేనికి లెండి! - ఇప్పుడు వెళ్ళి, ఆరు నెలల తర్వాతనే రండి! (లేచి, లోపలికి వెళ్లబోతుంది.)

భీముడు : (తాను కూడా చరాలున లేచి, ఆమె దారికి అడ్డంగా నిలిచి) వెళ్లడానికి వీల్లేదు. ఇది యువరాజుల ఆజ్ఞ!

ద్రౌపది : దాన్ని మహారాజ్ఞి ఉపసంహరిస్తున్నది.

భీముడు : ఇది పతి దేవుల ఆదేశం!

Acc. No
Class No
LIBRARY

ద్రౌపది : దాన్ని సతీమణి తిరస్కరిస్తున్నది.

భీముడు :ఇది ప్రియుని కన్నీటి విన్నపం!

ద్రౌపది : దాన్ని ప్రియురాలు మన్నిస్తున్నది! (కిలకిల నవ్వులతో ఉభయులు తిరిగి భద్రాసనంపై దగ్గరిగా కూర్చుంటారు)

భీముడు :(కలశాన్ని అందుకుని) ఈ పానీయం కొంచెం సేవిస్తారా?

ద్రౌపది : నా కోర్కె చెల్లిస్తే!

భీముడు :ఏమిటది?

ద్రౌ-- చెల్లిస్తామని ముందు వాగ్దానం చేయండి తర్వాత చెబుతా!

భీముడు :బుద్ధి చెప్పి పంపవలసిన జయద్రథుడెవడో కొత్తగా తటస్థ పడలేదు గదా?

ద్రౌపది : (నవ్వుతూ) లేదు.

భీముడు :అయితే, ఇంకొక కీచకుని వధించాలా?

ద్రౌపది : నన్ను కన్నెత్తి చూడ్డానికి ఏ కీచకుడు ఇప్పుడు సాహసించలేదు.

భీముడు :మరొక దుశ్శాసనుని గుండలు చీల్చాలా?

ద్రౌపది : నా పేరు వింటేనే ఎందరు దుశ్శాసనులైనా ఇప్పుడు గిజగిజలాడతారు!

భీముడు :వేరొక దుర్యోధనుని తొడలు విరగగొట్టాలా?

ద్రౌపది : దుర్యోధనులిప్పుడు నా దాసాన దాసులు!

భీముడు :తిరిగి సౌగంధి కొలను తెచ్చి పెట్టాలా?

ద్రౌపది : ఇప్పుడవి నా కాసారంలో కోకొల్లలు!

భీముడు :అయితే, మరేమిటి?

ద్రౌపది : వాగ్దాన మివ్వడానికి మీ కింత భయం దేనికి?

భీముడు : భయమా? అది మనకు ఇంటా వంటా లేదు.

ద్రౌపది : అయితే వాగ్దానం ఎందుకు ఇవ్వరు?

భీముడు : మా అన్నగారి శ్రీరంగనీతులను ఆక్షేపించరాదని కొట్టబోవుగదా? అది మా వల్ల కాదు.

ద్రౌపది : మీ అన్నగారికి మీరంటే ఎంతప్రేమో మీకు తెలియదు!

భీముడు : ఔనౌను! ఆయన గీసిన గీత దాటనంత వరకు చాలా ప్రేమ!

ద్రౌపది : అంతేనా?

భీముడు : మరెంత?

ద్రౌపది : అయితే, ఆయన పట్ల అపార భక్తి విశ్వాసాలు చూపిస్తారు దేనికి?

భీముడు : ఎందుకో నాకే తెలియదు! ఆయన యెదట పడేసరికి ఈ పెద్దపులి కూడా పిల్లికూన అయిపోతుంది! నా ఈ పెంకితనమే మళ్ళీ మనకు ముప్పతిప్పలు తేవచ్చు.

ద్రౌపది : అదేమిటి?

భీముడు : ఆ పుట్టుగ్రుడ్డి పలుకే తిరిగి శాసనమై చెల్లుతున్నదిగా!

ద్రౌపది : ధృతరాష్ట్ర మహారాజులను అంతమాట అనవచ్చునా?

భీముడు : "పుట్టుగ్రుడ్డి" అనడం తప్పైతే "జనుషాంధుడు" అంటాలే!

ద్రౌపది : పాపం! ఆయనను చూస్తేనే ఇప్పుడు జాలి వేస్తున్నది. దేనికండీ ఆయనపై మీకింత కోపం?

భీముడు : నాకు కోపం దేనికో తర్వాత చెబుతాను; నీకు జాలి దేనికో ముందు చెప్పు

ద్రౌపది : ఆయన ఎంత దౌర్భాగ్యస్థితిలో పడిపోయారో మీకు తెలియదా! - నేను చెప్పడం దేనికి?

భీముడు : అయితే, అందుకు బాధ్యులెవరు? తానే కాడా?

ద్రౌపది : ఇప్పుడు ఆ పాత విషయాలను త్రవ్వడం దేనికి లెండి! అయినదేదో అయిపోయింది!

భీముడు : ఆ తర్వాత మాట - "కానున్న దేదో కాక మానదు!" ఈ శుష్క వేదాంతాన్ని నమ్ముకుంటే మళ్ళీ మనం భిక్షాటన చేసుకోవలసి వస్తుంది!

ద్రౌపది : ఆ! మీవన్నీ విడ్డూరపు మాటలు!

భీముడు : నీకు తెలియదేమో కాని, చచ్చిన తన కుమారులకు పిండ ప్రదానాల పేరుతో ఆయన మన రాజకోశాగారాన్ని అడ్డమైన వాడికీ అదేపనిగా దోచిపెడుతున్నాడు! ఆయన గోదానాలు, భూదానాలు, సువర్ణదానాలు నానాటికి మితిమీరి పోతున్నాయి. అయినా, ఈయనున్నారే - మన యుధిష్ఠర చక్రవర్తులు - వీరు అడ్డు చెప్పడం లేదు. "ఓహోహో! అజాత" శత్రువులంటే వీరే! ఆ బలిచక్రవర్తులంటే వీరే!!" అని లోకం తనను మెచ్చుకోవాలని కాబోలు, ఆయన ఒకటి యివ్వమంటే, వారు పది యిస్తున్నారు!

ద్రౌపది : ఇస్తే మాత్రం మనకు వచ్చిన లోపమేమిటి లెండి! కురువృద్ధులందరు వెళ్ళిపోయారు; మిగిలింది ఒక్క ధృతరాష్ట్రులే! ఆయన మనశ్శాంతికై మనం ఏమైనా సరే చేయవలసిందే!

భీముడు : ఆయన మనశ్శాంతి! మన చేత తిరిగి తిరిపమెత్తిస్తే తప్ప ఆ దుష్ట బుద్ధికి మనశ్శాంతి సిద్ధించదు. సరే! - ముందు ఈ భీమసేనులకు ఇప్పుడు మనశ్శాంతి కావాలి! మరొక మధుకలశం ప్రసాదించండి!

ద్రౌపది : ముందు ఈ మాట చెప్పండి - నాకు వాగ్దానమిస్తారా, లేదా?

భీముడు : ఇవ్వక నాకు తప్పతుందా? సరే, నానుంచి ఏమి కావాలో చెప్పు!

ద్రౌపది : మరేమి లేదు. మీకు పుణ్యం వుంటుంది. నా మాట విని పానీయంలోనైనా కాస్త అమితంగా వుండండి! ఈ పూట భోజనం చేస్తూ ఎన్ని కలశాలు సేవించారో తెలుసా?

భీముడు : కలశం పైకెత్తితే మనకు కనబడేవి చుక్కలు, లెక్కలు కావు.

ద్రౌపది : ఇందాక భోజనం చేస్తూ పదిహేడు; ఇప్పుడు ఫలహారం చేస్తూ (భీముని సమ్ముక్షంలోని కలశాన్ని వేలితోచూపుతూ) దాన్నికూడా కలుపుకుంటే పది!

భీముడు : గణితశాస్త్రంలో నీకింత పాండిత్యం వున్నట్టు మాకు తెలియదే!

ద్రౌపది : దేనికైనా ఒక మితం వుండాలి. మా చెల్లెలు జలంధర చెప్పింది - ఇప్పుడు మీరు కలశాల మధ్యనే కాలక్షేపం చేస్తున్నారని.

భీముడు : ఆ కాశీరాజు పుత్రిక తప్పులెన్నడంలో చాలా గొప్పదిలే! ఇక్కడికి ఆమెగారు ఎప్పుడు వేంచాశారేమిటి?

ద్రౌపది : నిన్న సాయంత్రం!

భీముడు : తెల్లవారితే నీ నగరులో నేను ప్రవేశిస్తానని తెలుసు కాబట్టి, నిన్న సాయంత్రమే వచ్చి నా పై నేరాలు మోపి వెళ్లిందన్న మాట! సరే! నేరస్థుని విచారించి తీర్పు చెప్పండి!

ద్రౌపది : (వెంటనే లేచి, అక్కడి భద్రాసనాలన్నింటిలో ఉన్నతమైన దానిపై న్యాయమూర్తి ఠీవీతో కూర్చుని, అభియోగపత్రాన్ని చదువుతున్నట్టు నటిస్తూ) హస్తినాపురపు నివాసులు, పాండుమహారాజుల ద్వితీయ పుత్రులు, కురు సామ్రాజ్య యువరాజులు అయిన శ్రీ భీమసేనులపై మహారాజ్ఞి ద్రౌపదిదేవిగారికి కాశీరాజ పుత్రిక, భీమసేనుల ద్వితీయ కళత్రం అయిన జలంధరాదేవి సమర్పించుకొన్న అభియోగ పత్రము. మహారాజ్ఞీ! యువరాజులు మద్యపానప్రియులను విషయము జగద్విదితము. వారి ఈ మద్యప్రియత్వము నానాటికి పెరిగిపోవుచున్నది.

ప్రస్తుతము వారు మద్యకలశాల మధ్య అహోరాత్రములు గడపు చున్నారు. రాచ కార్యములను వారు పూర్తిగా నిర్లక్ష్యము చేయుచున్నారు. క్రమక్రమముగా వారి ఆరోగ్యము సన్నగిల్లుచున్నది. మితిమీరి పోవుచున్న మద్యపానము నుండి వారిని నిరోధించుటకు నేను ప్రయత్నము చేయుచుండగా వారు నాపై కోపమువహించి, అప్పుడప్పుడు నా పట్ల క్రూరముగా ప్రవర్తించుచున్నందున, సమస్త విషయములను సవినయముగా మహారాజ్ఞికి ఇందుమూలముగా నివేదించు కొనడమైనది. (అభి యోగపత్రాన్ని మడతపెట్టి, ఒక వైపున వుంచుతున్నట్టు నటన చేసి) అభియోగ పత్రమును వింటివా? ఇందుపై ఏమి చెప్పుకొనగోరు చున్నావు?

భీముడు :(తన స్థానంలో కూర్చునే) నేను నిర్దోషిని.

ద్రౌపది : (కోపాన్ని నటిస్తూ) ఇది న్యాయస్థానము! న్యాయమూర్తి నిన్ను విచారించుచున్నారు. న్యాయమూర్తి సమ్ముఖమున ముకుళిత హస్తములతో నిలబడవలెనని, వినమ్రముగా సమాధానము చెప్పుకొనవలెనని హెచ్చరించుచున్నాను!

భీముడు :(లేచి, చేతులు కట్టుకుని నిలబడుతూ) నన్ను మన్నింపుడు.

ద్రౌపది : మంచిది! మన్నించితిమి! నీవు మితిమీరి మద్యపానము చేయుచుంటివా?

భీముడు :అంతగా మితిమీరుట లేదు.

ద్రౌపది : కొంతగా మితిమీరుచున్నావని నీ పలుకుల తాత్పర్యమా?

భీముడు :చిత్తము.

ద్రౌపది : అట్లు ఎందుకు చేయుచుంటివి?

భీముడు :సకారణముగనే!

ద్రౌపది : సకారణముగనా? ఆకారణమెద్దియో న్యాయమూర్తికి నివేదించుకొనుము.

భీముడు :దుశ్శాసనుని వధానంతరము నా ఉదరకోశములో తీవ్ర జ్వాలలు చెల రేగుచున్నవి.

ద్రౌపది : అతనిని వధించి ప్రతిజ్ఞాపాలనము చేసుకొన్నందున నీ కోపజ్వాలలు చల్లారియుండవలసినది కాదా? చల్లారుటకు మారుగా, అవి ప్రజ్వలించుట ఎట్లు సంభవించినది?

భీముడు : కోపజ్వాలలు చల్లారగా, అంతకంటె తీవ్రమైన కొత్తజ్వాలలు లేచినవని న్యాయమూర్తులకు నా విన్నపము.

ద్రౌపది : కొత్త జ్వాలలా? వాటి స్వభావమును వివరింపుము.

భీముడు : దుశ్శాసనుని రొమ్ము చీల్చి, అతడి రక్తమును నేను దోసిళ్ళతో త్రాగినట్టు న్యాయమూర్తి వినియుందురు. ఆ దుష్టాత్ముని రక్తము విషప్రాయమై నన్ను దహించివేయుచున్నది. ఆ బాధోపశమనముకై నేను పూర్వము కంటె కొంత అధికముగనే మద్యమును సేవించుచున్నాను!

ద్రౌపది : (చప్పున తన స్థానంలో లేచి, భీముని వద్దకు వచ్చి, రెండు భుజాలపై చేతులు వేసి, గొంతుతో) ఇది నవ్వులాటా? నిజమా?

భీముడు : నిజమే!

ద్రౌపది : బలునికి నిలువెల్లా విషమంటారు. సందేహం లేదు విషపూరితమైన వాడి రక్తమే మీ శరీరాన్ని దహించి వేస్తున్నది. నా మాట విని, వెంటనే రాజవైద్యులను పిలిపించండి. వారేదైనా విరుగుడు చెబుతారేమో!

భీముడు : ఊహూ! ఇది ఓషధాలకు లొంగే రుగ్మత కాదు.

ద్రౌపది : అదేమిటండీ!

భీముడు : కక్ష కొద్దీ ఏమో చేసాను గాని, ఇప్పుడు నేను కూర్చున్నా నిలుచున్నా, ఆ దృశ్యమే కళ్ళకు కట్టినట్టు కనబడుతూ వుంటుంది. నిద్రలోనూ అదే!

ద్రౌపది : పాపిష్టిదాన్ని! నా వల్లే మీకు...(దుఃఖం పెల్లుబికి రాగా మాట మధ్య ఆగిపోతుంది.)

:

భీముడు :(ద్రౌపది చెక్కిళ్ళపై కన్నీటిని తన చేతితో తుడుస్తూ) అబ్బే! ఏమీ లేదు! నిన్ను అనవసరంగా కలతపెట్టి నట్టున్నాను. నాకే? నేను నిక్షేపంలా వున్నాను. (వంగి, మధుపాత్రను అందుకుని దాన్ని ఖాళీ చేసి) ఇలా కూర్చో! (రెక్క పుచ్చుకుని ఆమెను ఒక భద్రాసనం వద్దకు తీసుకు వెళ్ళి, దానిపై కూర్చోబెట్టి, తాను ఆమె సరసన కూర్చుంటూ) జలంధర నాపై మరేమైనా నేరాలు మోపిందా?

ద్రౌపది : లేదు.

భీముడు :గత వారం మా అన్నగారితో గట్టిగా వివాదపడ్డాను - ధృతరాష్ట్రుని ప్రేరణపై ఆయన చేస్తున్న దానధర్మాలు మితిమీరిపోతున్నాయని, ఆయన ఈ ప్రస్తావన నీ వద్ద తెచ్చారా?

ద్రౌపది : లేదు.

భీముడు :తేవలసిందేనే! - ఎందుకు ఊరుకున్నారో!

ద్రౌపది : ఆయన మాటకేమి గాని, మీ సంగతి చెప్పండి. విషతాపంలాంటిది మిమ్ము బాధిస్తున్నదా?

భీముడు :అబ్బే! లేదు! ఊరికే అన్నాను.

ద్రౌపది : ఊరికే అన్నారా?

భీముడు :ఔను! నీవు నాటకం నడుపుతున్నావని హాస్యోక్తిగా నేనన్న దానికి ఇంతగా బెదిరిపోవాలా?

ద్రౌపది : అది హాస్యోక్తి మాత్రమేనా?

భీముడు :కాక?

ద్రౌపది : అనవసరంగా నన్ను ఎంత కలత పెట్టారండీ!

భీముడు :సరేగాని, మరికాస్త ఫలహారం తెస్తావా?

ద్రౌపది : తిరిగి తేవలసిందేనా? (ఈ మాటలు అంటూనే లోపలికి వెడుతుంది. భీముడు తన స్థానంలో నుంచి లేచి, పచార్లు చేస్తూ వుంటాడు. కొన్ని క్షణాల తర్వాత ద్రౌపది ఫలహారంతో తిరిగి ప్రవేశిస్తుంది)

భీముడు : (పచార్ల మధ్య ఆగి, ద్రౌపది వంక చూస్తూ) దాని పట్ల ఇంత నిర్దయ దేనికి?

ద్రౌపది : అదేమిటి?

భీముడు : ఫలహారం అంటే కేవలం దాన్నే తెస్తారా?

ద్రౌపది : మరేమి తెస్తారు?

భీముడు : "అన్న పానీయా" లని పెద్దలన్నారు. అన్నంతోపాటు పానీయాన్ని కూడా తీసుకురావద్దా?

ద్రౌపది : దీన్ని మీరు తింటే తినండి, మానితే మానండి, మరి నేను మధువును తెచ్చేది లేదు, లేదు, ముమ్మాటికీ లేదు.

భీముడు : అంతేనా!

ద్రౌపది : మరెంత? దేనికైనా ఒక మితం వుండాలి. (చేతిలోని ఫలహారాల పళ్ళెరాన్ని పాతదాని ప్రక్కగా పెడుతుంది)

భీముడు : నా ముచ్చట తీర్చిన తర్వాత నీవు చెప్పదలచిన నీతులను చెప్పరాదా?

ద్రౌపది : అందువల్ల ఫలితం?

భీముడు : (తాను నిలబడివున్న చోటనే హఠాత్తుగా మోకరిల్లి, ప్రార్థన చేస్తున్నట్టుగా, రెండు చేతులు జోడించి, కళ్ళు సగం మూసుకుని) ఓ నారద మహర్షీ! ఎక్కడున్నావయ్యా, నీవు?

ద్రౌపది : (గొంతు మార్చి) "హరి నారాయణ! హరి నారాయణ! హరే!హరే! వత్సా! నీ భక్తిని మెచ్చితిమి! ఏమి కావలెను?

భీముడు :కోరిన వరమును తాము ప్రసాదింతురా, దేవా?

ద్రౌపది : అవశ్యము!

భీముడు :ఆడిన మాటను తప్పరుగదా?

ద్రౌపది : ఈ సందేహము మాపట్ల ఘోరాపచారము! కోపముతో మేము తిరో ధానము కానున్నాము!

భీముడు :దేవా! దేవా! .కోపగింపకుడు!

ద్రౌపది : మంచిది! నిన్ను క్షమించుచున్నాము. నీకు కావలసిన వరములను కోరు కొనుము!

భీముడు :నాకొక్క వరమే చాలును!

ద్రౌపది : ఆలసించక దానిని నివేదించుకొనుము!

భీముడు :మహర్షీ! మీ భక్తునికి పాంచాలి శ్రీరంగనీతుల బాధ నుండి శాశ్వత ముగా విముక్తిని ప్రసాదింపుడు!

ద్రౌపది : నీతి పైనే నిఖిల జగత్తులు నిలిచియున్నవి, నాయనా!

భీముడు :నీతికి, శ్రీరంగనీతికి భేధము లేదా, స్వామీ!

ద్రౌపది : లేకేమి, వత్సా? లేకేమి?

భీముడు :నేను రక్షణ కోరుచున్నది శ్రీరంగనీతి నుండియే!

ద్రౌపది : దానిని నీకు సంతోషముగా ప్రసాదించుచున్నాము!

భీముడు :ధన్యోస్మి! ధన్యోస్మి! (నవ్వుతూ కలశాన్ని ఒక్కగుక్కతో ఖాళీ చేస్తాడు)

ద్రౌపది : నాకు భాగం పెడతామన్నారు!

భీముడు :మరొక కలశం తీసుకురా! చెరిసగం పంచుకుందాము!

ద్రౌపది : మరి నేను తీసుకురాకే!

భీముడు : అందుకే అర్జునుడంటే నాకు చెడ్డ అసూయ!

ద్రౌపది : అసూయ దేనికి?

భీముడు : ధర్మముద్రతో దేవతా విగ్రహం వలె నా వద్దకు వస్తావు; ప్రణయ ముద్రతో ప్రౌఢనర్తకివలె అతని వద్దకు వెడతావు!

ద్రౌపది : అయితే, నన్నొక కొత్త అవతార మెత్తించే తమ ప్రజ్ఞ సామాన్యమైందా? (నవ్వుతుంది)

భీముడు : (బ్రతిమాలుతున్నట్టు) అంతటి ఈ ప్రజ్ఞానిధికి పారితోషికంగా మరొక్క కలశం!

ద్రౌపది : రేపటి వరకు తిరిగి అడగరాదు!

భీముడు : అయితే, మరి మూడు!

ద్రౌపది : కాదు, ఒక్కటే!

భీముడు : పోనీ, మధ్యస్థంగా రెండు!

ద్రౌపది : మధ్యస్థాలు, గిధ్యస్థాలు ఈ మహారాజ్ఞికి మనస్కరించవని తమకు తెలియదా?

భీముడు : అయితే, ఈ యువరాజు ప్రభువులు ప్రస్తుతానికి తమ పిపాసను ఒక కలశంతోనే తీర్చుకుంటారు!

ద్రౌపది : ప్రస్తుతం లేదు, అప్రస్తుతం లేదు - రేపటి వరకు తిరిగి అడగరాదు!

భీముడు : సరే! తమ చిత్తం; మా ప్రాప్తం! (ద్రౌపది మధుకలశానికై లోనికి వెడుతుంది. భీముని దృష్టి తిరిగి ఫలహారం పళ్ళెంపై లగ్నమౌతుంది.)

ద్రౌపది : ( కలశంతో తిరిగి వస్తూ, ఆవలిస్తున్న భీముని చూచి) నిద్రాదేవత అప్పుడే మిమ్ము వరిస్తున్నదా?

భీముడు : ఆ జీవితేశ్వరి విలంబాన్ని సహించలేదు.

ద్రౌపది : ఆమె మీ పంచమ కళత్రం! మీకు ప్రియతమ!

భీముడు : పంచమ కాదు, ప్రథమ! ఓం ప్రథమంగా మమ్ము వరించిన ప్రేమస్వ రూపిణి! (ద్రౌపది నవ్వు) తమ అమృత హస్తంతో ఆ సువర్ణకలశాన్ని ఇలా దయచేయించండి! (చిరునవ్వుతో మధుకలశాన్ని భీముని ముందు పెట్టి, అతని సరసన ద్రౌపది కూర్చుంటుంది. ఆమె కూర్చుండబో తుండగానే కలశాన్ని చేత బట్టుకుని భీముడు లేస్తాడు.)

ద్రౌపది : మంచి మర్యాదస్తులే - నేను ప్రక్కకు వచ్చి కూర్చోగానే లేచిపోతారా?

భీముడు : (ఆమె మాట వినిపించుకోనట్టు, కలశాన్ని ఒక్క గుక్కలో ఖాళీ చేసి, దాన్ని బల్లపైవుంచి, ద్రౌపది రెక్కపుచ్చుకుని, ఆమెను శయ్యవైపుకు లాక్కుపోతూ) దేవీ! నిద్రాదేవీ! నా ప్రాణప్రియా! వచ్చుచున్నాను, ఇదే వచ్చుచున్నాను. (కిలకిల నవ్వుతూ, తన చేతిని విడిపించుకొనడా నికి ప్రయత్నిస్తున్నట్టు ద్రౌపది నటన చేస్తుండగా -- తెర)

(వాడిపోతున్న పూలమాలపై ద్రౌపది చన్నీటిని చిలకరిస్తుండగా తెర లేస్తుంది. ఆ తర్వాత ఆమె సుగంధ కలశాన్ని పరిశీలించి, దాన్ని కూడా తడిచేస్తుంది. దాదాపు పూర్తిగా కాలిపోయిన అగరువత్తులను తీసివేసి, కొత్తవాటిని వెలిగిస్తుంది. ఆ తర్వాత దాచుకోలేని అశాంతితో శయ్యాగారంలో నడయాడుతుంది. ద్వారం గుండా, గవాక్షం గుండా రెండు, మూడుసార్లు బయటికి తేరిపార జూస్తుంది. మధ్యలో ఒకసారి నిలువుటద్దం వద్దకు వెళ్ళి, నుదుటిపై తిలకాన్ని, సిగలోని పువ్వులను సరిదిద్దుకుంటుంది. ఆమె తిరిగి గవాక్షం గుండా చూస్తుండగా అర్జునుడు ప్రవేశిస్తాడు. అడుగుల చప్పుదును బట్టి, ఆయన వచ్చినట్టు తెలుసుకున్నా, ద్రౌపది వెనుదిరిగి చూడదు. ఆమె వాలకాన్ని చూచి, తనపై అలిగి వున్నట్టు అర్జునుడు గ్రహిస్తాడు. ఆమె దృష్టిని ఆకర్షించడానికి ఒకటి రెండుసార్లు పొడిదగ్గు దగ్గుతాడు. అప్పటికీ ఆమె వెనుదిరిగి చూడక పోగా, చెంతకు వెడతాడు)

అర్జునుడు: ( ద్రౌపది వెనక నుంచి, తాను కూడా గవాక్షంలో నుంచి వెలుపలికి చూస్తూ ) పున్నమ రేయిలో పులకరిస్తున్న పుష్పవనాన్ని చూస్తున్నావా? ( ద్రౌపది పలకదు, కొన్ని క్షణాలు ఆగి) కాలంకాని కాలంలో ఆ నల్లని మబ్బు ఎక్కడ నుంచి దాపురించిందో! ( ద్రౌపది మౌనం, మరికొన్ని క్షణాలు తర్వాత) ఆ మబ్బు తెర తొలగిపోతేనే, మళ్ళీ మనకు పాలవెన్నెల!

( ద్రౌపది గిర్రున వెనక్కు తిరిగి, ఇవతలికి వచ్చి, భద్రాసనంపై కూర్చుంటుంది. తనను అనుసరించి వచ్చిన అర్జునుడు సరసన కూర్చోగా పెడముఖం పెడుతుంది)

అర్జునుడు: ఎందుకంత కోపము? (ద్రౌపది పలకదు, మరికొంత దగ్గరికి జరుగుతూ) పూర్ణ చంద్రోదయాన్ని కలిసి చూడవచ్చు. 'సంజవేళ్లకు ముందుగానే రండి' అని నీవు చెప్పిన మాట నేను మర్చిపోలేదు. (ద్రౌపది మారు పలకకపోగా, ఆమె ముఖాన్ని తన వైపుకు త్రిప్పుకుంటూ) చంద్రోదయాన్ని చూపలేదన్న విచారం నాకు దేనికి? కోపంతో ఎర్రబారిన నీ ముఖాన్ని చూస్తుంటే, ఉదయిస్తున్న పూర్ణచంద్రబింబాన్ని చూస్తున్నట్టుగానే వున్నది! (చెక్కిళ్ల వెంట ద్రౌపది కన్నీటి చుక్కలను జలజలరాల్చుతుంది.)

అర్జునుడు: కోపమే కాదు, బాధ కూడా కలిగించినట్టున్నాను! ఏ పరిస్థితులలో నేను నా వాగ్దానాన్ని నిలుపుకోలేక పోయానో తెలుసుకుంటే నన్ను తప్పక మన్నిస్తావు!

ద్రౌపది : (చివాలున లేచి) నేను మన్నించగలపాటిదాన్ని కాను!

అర్జునుడు: (ఆమెతో పాటు లేచి, గడ్డం పట్టుకుంటూ) ఇంత ఆగ్రహానికి నేనేమి మహాపరాధం చేశాను?(ఆమె కన్నీటిని చేతితో తుడుస్తూ) నీ కంటి తడి చూస్తే నేనెంత తల్లడిల్లిపోతానో నీకు తెలియదా?

ద్రౌపది : అంత దయగలవారైతే ఇంత జాగుచేస్తారా?

అర్జునుడు: ఎంత జాగు! నాలుగు గడియలే కాదా?

ద్రౌపది : నాలుగు గడియలేనా? అటు చూడండి - ఆ పూలమాల ఎంతగా వాడిపోయిందో! ఆ చందనం ఎంతగా యెండిపోయిందో!

అర్జునుడు: ( వంగి, పూలమాల పైకెత్తి) లేకలేక ఒక కన్నుకాగా, వేయి కళ్ళు విప్పుకుని, నా దారి కాస్తున్నావా? జాగును మరి సహించలేక కంటికంటి నుంచి కన్నీరు కురిపిస్తున్నావా? నీ పట్ల నిర్లక్ష్యంతో ఆలసించలేదు; గత్యంతరం లేకనే! ఏమైనా, జరిగిన దానికి నన్ను క్షమించు! నీ క్షమకు సూచనగా నీ మృదుహస్తాలతో నా గళసీమను కౌగలించుకో! ( పూలమాలను అర్జునుడు తానే మెడలో వేసుకుంటాడు, ద్రౌపది ముఖంపై చిరునవ్వు మొలకలెత్తుతుంది.)

అర్జునుడు: ( తిరిగి వంగి, గంధకలశాన్ని అందుకుని) నిన్ను కూడా క్షమాభిక్ష వేడుకుంటున్నాను. నా షక్షాన పాంచాలిని ప్రార్థించు. నీ శీతల స్పర్శతో ఆమె కోపాగ్ని జ్వాలను చల్లార్చు. ( అంగుళీయంతో చందనాన్ని తీసి, ద్రౌపది చుబుకానికి పూస్తాడు)

ద్రౌపది : మరి చాలులెండి - సంతోషించాం! ఎంతకూ రాకపోతే, ఎక్కడికి వెళ్ళారో, ఏమో అని నేనెంత భయపడిపోయానో మీకేమి తెలుస్తుంది!

అర్జునుడు: ( సుగంధ కలశాన్ని యథాస్థానంలో వుంచి, రెక్క పట్టుకుని ద్రౌపదిని భద్రాసనంపైన నెమ్మదిగా కూర్చోపెట్టి, ఆమె సరసన తాను కూర్చుంటూ) నన్ను గురించి భయం దేనికి? నాకు రాగల ప్రమాదాలు లేనే!

ద్రౌపది : లేకేమి? ఏ గంగలోనో మీరు స్నానం చేస్తుంటే, మరొక ఉలూచి హఠాత్తుగా రావచ్చు; అమాంతంగా మిమ్ము నాగభూమికి యెత్తుకుపోవచ్చు.

అర్జునుడు: (చిరునవ్వుతో) అంత పిచ్చిపిల్లలిప్పుడు లేరు.
ద్రౌపది : మరొక చిత్రాంగద మిమ్ము సమ్మోహితులను చేయవచ్చు. 'నా పుత్రునిపై నాకే అధికారం; మీకు లేదు' అనే నియమంపై మిమ్ము పరిణయమందవచ్చు.
అర్జునుడు: ఈ విధమైన విషమనియమాలకు ఎవరైనా రెండుసార్లు సమ్మతిస్తారా?
ద్రౌపది : బంధు రూపంలో మీరే మరొక సుభద్రాపహరణకై ఏ ద్వారకానగరికో తిరిగి వెళ్ళవచ్చు.
అర్జునుడు: నిజమే! బ్రాహ్మణ రూపంలో వెళ్ళి, మరొక మత్స్యయంత్రాన్ని ఛేధించినా ఛేదించవచ్చు.
ద్రౌపది : ఔను! తమ పేరే విజయులు! ఎన్ని విజయాలనైనా అవలీలగా సాధిస్తారు!
అర్జునుడు: అయితే, మరొక మత్స్యయంత్రాన్ని కూలగొట్టినా గెలుచుకొనడానికి మరొక ద్రౌపది లేదు!
ద్రౌపది : ద్రౌపదులు లేకపోతేనేమి? మీకు ప్రేయసులు తక్కువా? మీతో గడపగల భాగ్యం నాకు మరి రెండు వారాలు మాత్రమే! తిరిగి నాలుగేండ్లకు గాని నోచుకోను! అయితే, ఏ భామో కంటబడి వుండకపోతే, నాకు చేసిన వాగ్దానాన్ని మర్చిపోయి, ఇంత జాగుచేసేవారా?
అర్జునుడు: (నేరం అంగీకరిస్తున్న వానివలె) తప్పించుకు పోదామన్నా, దొంగ దొరికిపోయాడు!
ద్రౌపది : (తల పంకిస్తూ) ఎవతి ఆ సుందరాంగి?
అర్జునుడు: పదహారు, పదిహేడేళ్ళ వయస్సు.
ద్రౌపది : నవోఢ మన్నమాట!
అర్జునుడు: పసిడిఛాయ!
ద్రౌపది : అయితే, కుందనపు బొమ్మే!
అర్జునుడు: పెద్ద పెద్ద కళ్ళు.
ద్రౌపది : విశాలాక్షి కూడానా?
అర్జునుడు: మంచి అంగసౌష్ఠవం!
ద్రౌపది : మరి వర్ణించ నక్కరలేదు లెండి! నా నూతన సుపత్ని అతిలోక సుందరి!
అర్జునుడు: నాట్య విద్యలో అసాధారణ ప్రజ్ఞా ప్రాభవాలు.
ద్రౌపది : అందువల్లనే మీ మనస్సును మరింతగా ఆకర్షించింది!
అర్జునుడు: (ఒక్క క్షణం ఆగి, మాటలను నొక్కి పలుకుతూ) నూనూగు మీసాలు!
ద్రౌపది : (ఆశ్చర్యంగా) నూనూగు మీసాలేమిటి?

అర్జునుడు: పదహారు, పదిహేడేళ్ళ పడుచువానికి నూనూగు మీసాలుండవా?

ద్రౌపది : (నవ్వుతూ) నన్నెంత మాయ చేశారు!

అర్జునుడు: నా రాజ్యంలో ఎవరు నాట్యవిద్య నేర్చినా ఇప్పుడు పరీక్షార్థం నా వద్దకు వస్తున్నారు! బృహన్నల అయినందుకు నాకిది శిక్ష.

ద్రౌపది : నాట్యవిద్యా పరీక్ష మీరు శిక్షగా భావిస్తారంటే నేను నమ్మను! నాట్యాన్ని చూస్తుంటే మిమ్ము మీరే మరిచిపోతారు

అర్జునుడు: ఆ దౌర్బల్యం నాకున్న మాట నిజమే! అందుకే ఈ పూట నీ కోపతాపాలకు గురికావలసి వచ్చింది. నేడు పరీక్షార్థం వచ్చిన యువకుడు సహజ ప్రజ్ఞాధురీణుడు. దానికితోడు గొప్పగురువు వద్ద శాస్త్రీయ పద్ధతులలో చక్కని శిక్షణ పొందాడు. ఆంగిక, వాచిక, ఆహార్య, సాత్వకాభినయాలన్నింటిలో సమానంగా ఘటికుడు. లోకధర్మిలో వలే నాట్యధర్మిలో ....

ద్రౌపది : (నవ్వుతూ) తిరిగి బ్రహన్నల కాబోతున్నారా? అయితే ముందే చెబుతున్నాను - నేను ఉత్తర కుమారుని కాలేను; మీ వద్ద నాట్యవిద్య నేర్చుకోలేను.

అర్జునుడు: ఎందుకు నేర్చుకోరాదు?

ద్రౌపది : నేర్చుకొనకపోయినా, నాకు నర్తకి అనే బిరుదు రానేవచ్చిందిలెండి!

అర్జునుడు: అదెప్పుడు?

ద్రౌపది : ఎప్పుడేమిటి? కీచకుని దౌష్ట్యం నుంచి కాపాడవలసిందిగా విరాటరాజు కొలువుకూటంలో నేను మొరపెట్టుకున్నప్పుడు మీ పాండవాగ్రజులు నర్తకి నంటూ నిందించలేదా?

అర్జునుడు: ఓహో! ఆనాటి మాటా! దాన్ని నీవింకా మరిచిపోలేదన్నమాట. సరే! - దానికేమిగాని ఆయన మాటను నీవు నిజం చేస్తే నేను ఎంతో సంతోషిస్తాను. ఒక ఆరునెలలు చాలు - నాట్యవిద్యలో నీవు నిధివి కావడానికి.

ద్రౌపది : ( కన్నీటి గొంతుతో) అన్యాయమైపోయిన నా అయిదుగురు బిడ్డలకు మారుగా మరిఅయిదుగురిని కన్న తరువాత నేర్చుకుంటానులెండి.

అర్జునుడు: ఆ దుఃఖాన్ని మరచిపోవడానికైనా నీవు నా ముద్దు తీర్చవచ్చునే! అప్పుడు నాతోపాటు నీవు కూడ నాట్యసభలకు రావచ్చు; పరీక్షాధికారిణిగా కూర్చోవచ్చు.

ద్రౌపది : (చిరునవ్వుతో) మరొకసారి బృహన్నల కావాలని మీకు ముచ్చటగా వున్న దేమో కాని ఆ రూపాన్ని మీరు తిరిగి ధరిస్తే నేను భరించలేను. అప్పుడు మీ పేడుమూతి చూసినా, ఆడంగి మాటలువిన్నా నాకు పుట్టెడు దుఃఖంతో పాటు పట్టరాని నవ్వు వచ్చేది.

అర్జునుడు: నాట్యాచార్యుడుగా నన్ను నీవు మెచ్చుకోకపోయినా మొదటిసారి మన చూపులు కలిసినప్పుడే నాట్యశాస్త్రంలో నీకు సహజపాండిత్యం వున్నట్టు నేను గుర్తించాను.

ద్రౌపది : అలాగా! దేన్ని బట్టి నా పాండిత్యాన్ని మీరు గుర్తించారో సెలవిస్తారా?

అర్జునుడు: స్వయంవర సభకు నీవెంత సమయోచితంగా అలంకరించుకు వచ్చావు! పసిడి పళ్లెంలో పుష్పహారం పెట్టుకుని సభలో ప్రవేశించగానే నీకు కలిగిన లజ్జా భయ సంభ్రమాలను కప్పిపుచ్చుకొనడానికై చేలాంచలంతో ముఖాన్ని సగం దాచుకుంటూ ఎంత లావణ్యాన్ని ప్రదర్శించావు! ఆహార్యాభినయం అంటే అదికాక మరేమిటి?

ద్రౌపది : దానిలో యోగ్యతాపత్రం ఆనాడే నాకు ప్రసాదించారన్నమాట!

అర్జునుడు: మత్స్యయంత్రాన్ని కూలవేయడానికి కర్ణుడు ముందుకు వచ్చి, విల్లు వంచి, అల్లెత్రాడు కట్టగానే "సూతుని నేను పతిగా పరిగ్రహించ"నని ఉచ్చైస్వరంతో ఎంత గంభీరంగా పలికావు! ఆ పలుకులకు కర్ణుడు నిశ్చేష్టుడై నిలబడిపోయాడు; అదే వాచికాభినయమంటే.

ద్రౌపది : దానిలో కూడా నేను పట్టభద్రనన్నమాట.

అర్జునుడు: నేను మత్స్యయంత్రాన్ని ఛేదించగానే తమకేదో ఘోరావమానం జరిగినట్టు వికటాట్టహాసాలు చేసిన నృపతి లోకంపైకి ఒక్కతృటిపాటు వెళ్ళిన నీదృష్టిలో నిర్లక్ష్య తిరస్కారభావాలు ఎంతగా ప్రస్ఫుటమైనాయి! దాని పేరే సాత్వికాభినయం.

ద్రౌపది : అయితే ఆంగికాభినయమేదో వివరిస్తారా?

అర్జునుడు: కల్లోలిత సముద్రంవలె స్వయంవర సభామండపం వున్నా, నిశ్చల జలనిధిపై తలివచ్చే రాయంచవలె నీవు శ్వేతవస్త్రంతో పుష్పహారంతో నావద్దకు వచ్చి వాటిని నామెడలో వేశావు. ఆంగికాభినయానికి అది పరాకాష్ఠ.

ద్రౌపది : (నవ్వుతూ) మీ మాటలను వింటూంటే నాట్యవిద్య మీరు నావద్ద నేర్చుకున్నట్టుగా తోస్తున్నది! అయినా నాకు గురు దక్షిణ ముట్టజెప్పనే లేదు.

అర్జునుడు: చెంతవున్నా, దూరమైనా అనుదినం దాన్ని నీ పాదారవిందాల వద్ద సమర్పించుకుంటూనే వున్నాను.
ద్రౌపది : అనుదినం!
అర్జునుడు: ఔను! అనుదినం! ప్రతిక్షణం!
ద్రౌపది : లేదు.
అర్జునుడు: మరి నిట్టూర్పు దేనికి?
ద్రౌపది : ఆ! ఏమీలేదులెండి!
అర్జునుడు: అకారణంగా నిట్టూర్పుతారా?
ద్రౌపది : మీరు స్వయంవర సభాప్రసక్తి తెచ్చేసరికి ఏవేవో విషయాలు జ్ఞాపకానికి వచ్చాయి.
అర్జునుడు: ఏమిటవి?
ద్రౌపది : ఎందుకు పోనిద్దురూ!
అర్జునుడు: మనసు విప్పి నీవు మాట్లాడడానికి నేను తగనివాడినా?
ద్రౌపది: ఎంతమాట!
అర్జునుడు: అయితే చెప్పరాదా?
ద్రౌపది: చెప్పక తప్పదా? సరే! స్వయంవర సభామండపం నుంచి నన్ను వెంటపెట్టుకుని కుంభకారుని గృహానికి వెళ్ళిన మీరు వాకిలి తట్టిందే "అమ్మా! భిక్ష తెచ్చా" మన్నారు. లోపల ఎక్కడో పనిమీద వున్న మీ అమ్మ మీ మాటలలోని చమత్కారాన్ని గ్రహించలేక "అయితే మీ అన్నదమ్ములు అయిదుగురు సమానంగా అనుభవించండి" అనింది. ఇది మీకు జ్ఞాపకమేగా?
అర్జునుడు: మబ్బులేని పిడుగును పోలిన ఆ మాటను కావాలన్నా నేను మరిచి పోగలనా?
ద్రౌపది : తెలియకే తాను ఆ విధంగా పలికినా శుష్కంగా తానొక పలుకు పలికిన దోషం తనకు ఎక్కడ చుట్టుకుంటుందో అని మీ తల్లి విచారపడింది.
అర్జునుడు: ఔను.
ద్రౌపది : ఆమె విచారం మీకు విడ్డూరంగా తోచలేదా?
అర్జునుడు: కొంతవరకు అలాగే తోచింది, కాని శుష్కంగా తానొక పలుకు పలికిన పాపం నిజంగానే తనకు...
ద్రౌపది : తెలియక తప్పుగా పలికినదాన్ని తెలిసిన తరువాత దిద్దుకొనక పోవడంవల్లనే ఎక్కువ పాపం చుట్టుకోదా!
అర్జునుడు: నిజమే.

ద్రౌపది : అయినా, మీ తల్లి తన తప్పును దిద్దుకోలేదంటే అందుకు అన్యకారణం లేదంటారా?

అర్జునుడు: అన్యకారణమా? ఏమిటది?

ద్రౌపది : ఎంతైనా మీరు తల్లీకొడుకులు. మీ మనస్సుకు నొప్పి కలుగుతుందేమో! - నేనెందుకు చెప్పాలిలెండి!

అర్జునుడు: కలగదులే - చెప్పు!

ద్రౌపది : చెప్పవలసిందేనా?

అర్జునుడు: నిస్సందేహంగా!

ద్రౌపది : కర్ణ జనన వృత్తాంతం విన్నారుగా?

అర్జునుడు: (కొంతబాధతో) వినకేమి?

ద్రౌపది : ఆ తర్వాతనే కాదా స్వయంవరం ద్వారా ఆమె మీ తండ్రి పాండురాజును చేపట్టింది? ("ఔ" నన్నట్టు అర్జునుడు పంకిస్తాడు). వివాహం ద్వారా మరి ముగ్గురు ఆమెకు భర్తలు కాలేదా?

అర్జునుడు: అయితే?

ద్రౌపది : ఆ! ఏమీలేదు. తనవలె తనకోడలు కూడా పంచభర్తృక కావాలని మనస్సులో ఆమె కోరుకుని వుండవచ్చుకదా? (తన చెవులను తానే నమ్మలేక పోతున్నట్టు అర్జునుడు ద్రౌపది వంక చూస్తాడు) కోడలికి కూడా అయిదుగురిని కట్టబెట్టేసరికి లోకం తనవైపు వేలెత్తి చూపడం తగ్గిపోలేదా?

అర్జునుడు: ఇంత దురాలోచన మా అమ్మ నిజంగానే చేసిందంటావా?

ద్రౌపది : ఏమో! అది మీకు తెలియాలి. ధర్మపరులైన మీ అన్నగారికి తెలియాలి. ఆయన మీ అమ్మమాటలకు తాళం వేస్తూ పోయారుగా!

అర్జునుడు: ఏ మాటకామాటే చెప్పాలి. మొదట ఆయన మా అమ్మతో "ఈమె పార్థుడు జయించి తెచ్చిన కన్య, ఈమెను అతడు పరిణయమాడడమే సమంజసం" అన్నారు".

ద్రౌపది : అనలేక, అనలేక మొదట ఆ కాస్తముక్క అన్నారనుకోండి. అంతట మీరేమన్నారు?

అర్జునుడు: అపుడు నామనస్సులో పెద్దతుఫాను రేగుతున్నది; నానోట మాటే పెగలి వుండకపోవచ్చు.

ద్రౌపది : లేదు. " అన్నలిద్దరు అవివాహితులై యుండగా నేను వివాహం చేసుకోవడం భావ్యం కాదు, మీ వివాహాలయ్యేవరకు నేనూ, పాంచాలీ వేచివుంటా" మన్నారు.

అర్జునుడు: ఆమాట నేనన్నానా?

ద్రౌపది : లేదు. (నిట్టూర్చుతూ) ఔను! తక్కిన మాటలన్నీ వినబడినా మీ అన్నగారికి ఈ ఒక్కదాని వద్దకు వచ్చేసరికి పుట్టెడు చెముడు వచ్చింది.

అర్జునుడు: (అశాంతితో చప్పున లేచి నిలబడుతూ) అప్రియమైన పలుకులు ఇప్పటికైనా ఆయనకు వినపడవు.

ద్రౌపది : (తాను కూడా లేచి, అర్జునునికి దగ్గరగా నిలిచి) మీకు అప్రియమైతే కావచ్చుగాని, మరొకసత్యాన్ని బయటపెట్టడం లేదా? మీరు ఏ క్షణాన మత్స్యయంత్రాన్ని కూలవేశారో ఆ క్షణంలోనే ఆయనకు మీపై అసూయపుట్టింది.

అర్జునుడు: ఇది మరీ అన్యాయపు మాటేమో!

ద్రౌపది : అయితే, ఈ మాటకు బదులు చెప్పండి, బ్రాహ్మణవేషంలో వున్న మిమ్ము నిజంగానే బ్రాహ్మణ యువకునిగా భావించి తాము కూలవేయలేకపోయినా మత్స్యయంత్రాన్ని మీరు కూలవేసినందుకు క్షత్రియ లోకం ఒక్కుమ్మడిగా మీపై ఫీంకారం చేయలేదా?

అర్జునుడు: ఔను!

ద్రౌపది : అది మీకు ప్రమాదసమయం కాదా? అయినా, సరిగా అపుడే నకుల సహదేవులను వెంట పెట్టుకుని మీ ధర్మరాజులు సభామండపం నుంచి ఎందుకు వెళ్ళిపోయారు?

అర్జునుడు: నాకు రాగల ప్రమాదం లేదన్న విశ్వాసంతో కావచ్చు. నాకు సహాయ్యం కావలసివస్తే మా భీముడున్నాడన్న తలంపుతోనూ కావచ్చు.

ద్రౌపది : అయినా, సరిగా అప్పుడే ఎందుకు వెళ్ళాలి? అంత హుటాహుటిగా ఎందుకు వెళ్ళాలి? ఆయన తప్ప సభలో నుంచి అప్పుడు మరెవరైనా కదిలారా?

అర్జునుడు: (కొన్ని క్షణాలపాటు తటపటాయించి) ఏ కారణాన సరిగా... అప్పుడు... ఆయన... ఆ! అన్నట్టు, లాక్షాగృహం నుంచి తప్పించుకున్న నాటి నుంచి రహస్యంగా జీవిస్తున్న మాఅన్నదమ్ములైదుగురిని ఒకే చోట, ఒకే తీరుగా చూస్తే, దుర్యోధన దుశ్శాసనాదులు గుర్తించ గలరన్న భయం ఆయనకు హఠాత్తుగా కలిగి వుండవచ్చు. అందువల్లనే నకుల సహదేవులను వెంటబెట్టుకుని ఆయన చప్పున సభనుంచి లేచి పోయి వుండవచ్చు.

ద్రౌపది: అన్నగారిని చాలా గట్టిగా సమర్థిస్తున్నారు. (అలిగినట్టు గిరుక్కున వెనక్కుతిరిగి, నాలుగడుగులు వేసి, ఒక భద్రాసనంపై కూర్చుంటుంది.)

అర్జునుడు: (చెంతకు వెళ్ళి, ప్రక్కన కూర్చుంటూ) నీ మాటలను నేను త్రోసి వేయడం లేదు. కాని, మనం ఒక తీర్మానానికి వచ్చేముందు మంచి చెడ్డలను పూర్తిగా వితర్కించు కోవాలిగదా! కోపం మాని, నీవే చెప్పు! - నేను మత్స్యయంత్రాన్ని కూలవేశానన్న సంతోషవార్తను మా అమ్మ చెవిని వేయడానికే ఆయన అంత తొందరగా బయల్దేరి వుండగూడదా?

ద్రౌపది : అందుకు తామే వెళ్ళాలా? నకుల సహదేవులను పంపితే సరిపోయేది కాదా? (అర్జునుడు మాటాడడు) పోనీ, తాము స్వయంగానే ఆ వార్త చెప్పగోరితే ఆ తర్వాత ఎంతసేపటి వరకు ఆయన ఇల్లు చేరుకోలేదేమిటి?

అర్జునుడు: నిజమే సుమీ!

ద్రౌపది : మనకంటె చాలా ముందుగా బయల్దేరిన మీ అన్నగారు ఏకాస్త ముందుగానైనా జరిగిన సంగతిని మీ అమ్మకు చెప్పివుంటే, మీ చతురోక్తిని ఆమె అపార్థం చేసుకుని వుండేదా? (అర్జునుడు ఆలోచనలోపడి బదులుచెప్పడు) "ఈమె పార్థుడు జయించిన కన్య, ఈమెను అతడు పరిణయమందడమే సమంజసం" అంటూనే మీ ధర్మజులు నావంక అదొక విధంగా చూచారు. ఆయన తమ మాట మార్చి వేసింది ఆ తర్వాతనే. (తిరిగి అర్జునుని మౌనం) "ఇది మీకు తగునా! అన్నయ్యా?" అని మీరు వెంటనే అనివుంటే ఆయన బహూశా సర్దుకునే వారే! కాని, మీరు పూర్తిగా మౌనం వహించారు. మీ మౌనాన్ని అర్ధ అంగీకారంగా ఆయన భావించారు. ఆ తర్వాత మా నాన్నగారు ఎంత మొత్తుకున్నా లాభం లేకపోయింది. (అర్జునుని ముఖకవళికలను గమనిస్తూ, కొన్ని క్షణాలపాటు మిన్నకుండె, ఆ పిమ్మట) "ఊ" అంటే ఒక పుక్కిటి పురాణగాథ, "ఆ" అంటే మరొకటి మీ ధర్మజులు చెప్పగలరయ్యే! గ్రుక్క త్రిప్పకోకుండా వాటిని ఏకరువు పెట్టి, ఎంతటి విడ్డూరాన్నయినా సమర్థించగలరయ్యే! ఝటిల అంటూ పూర్వం ఎవతో వుండేదట. అది సప్తర్షులను పెండ్లాడిందట! ఊరుపేరూ లేని మరెవతో పదిమంది అన్నదమ్ములను వరసపెట్టి కట్టుకున్నదట! వీరిద్దరే ఆయన కంట ఎందుకు దూరారో? ఒకే భర్తతో హాయిగా సంసారాలు చేసుకుంటున్న కోటాను కోట్లమంది ఆయన చూపుకు ఎందుకు అనలేదో? ఏ! మాట్లాడరే?

అర్జునుడు: మా ధర్మజుల ఈ కుంతి వాదాన్ని ముద్రుపదులు గట్టిగా ఖండించ వలసింది. ఆ పని ఆయన చేసివుంటే....

ద్రౌపది : ఏ? ఇది వేదవిరుద్ధమని ఆయన చెప్పలేదా? మన ఆచార వ్యవహారా లకు విరుద్ధమని చెప్పలేదా?

అర్జునుడు: చెప్పకపోలేదుగాని, ఏమంత కరుకుగా చెప్పలేదు. "మత్స్యయంత్రాన్ని కూలవేసిన వానికే నా కుమార్తెనిస్తానని నేను దేశదేశాలలో చాటిం చాను. ఏమైనా సరే నామాట నిలబెట్టుకోవాలి" అని ఆయన ఖండితంగా చెప్పివుండవలసింది!

ద్రౌపది : ద్రోణాచార్యుల షక్షాన యుద్ధానికి వచ్చి, మీ అన్నదమ్ములు మీ చిన్న తనంలోనే మానాన్నగారిని ఒకసారి ఓడించారటగా! అందువల్ల మీకు కోపం తెప్పిస్తే మీరేమి అఘాయిత్యానికి దిగుతారో అని ఆయన భయ పడి వుండవచ్చు.

అర్జునుడు: ద్రుపద మహారాజులు అంత పిరికికండ కలవారని నేననుకోవడం లేదు. మా అన్నదమ్ములను కూడగట్టుకుంటే, ద్రోణాచార్యుని శిష్యులుగా వచ్చి, తన నోడించిన మా ద్వారానే ఆయనపై తన పగ తీర్చుకొనవచ్చునని మీ నాన్నగారు ఆలోచించి వుండవచ్చు.

ద్రౌపది : ఆ ద్రోణాచార్యులవారిపట్ల పగ మానాన్నగారి చేత చాలా పిచ్చిపనులు చేయించింది. లెండి!

అర్జునుడు: మా ధర్మజులను సంతోషపెట్టాలనే కావచ్చు. "కావాలంటే మీరొక్కరే మా అమ్మాయిని చేసుకోండి" అని మీద్రుపదులన్నారు.

ద్రౌపది : ఉహూ! ఆయన అలా అనలేదు. "అయిదుగురికి కలిపి వివాహమనడం విడ్డూరం. కావాలంటే అగ్రజులైన మీరొక్కరే చేసుకోండి; లేదా, మీ తమ్ములు నలుగురిలో ఏ ఒకరికో చేసుకోండి" అన్నారు.

అర్జునుడు: ఆ మాటలు విన్నప్పుడు "అయితే, నేనొక్కడినే చేసుకుంటా!" అని మా అన్నగారు ఎక్కడ అనగలరో అని నేను చాలా భయపడ్డాను.

ద్రౌపది : అయితే, మాటలో మాటగా "ద్రుపదమహారాజుల మనస్సు మనమెం దుకు నొప్పించాలి. నేనొక్కడినే చేసుంకుంటా!" అని మీరెందుకన్నారు కాదు?

అర్జునుడు: మా ధర్మజులు స్వార్థానికి అతీతులు కారని నాకు తెలుసు. స్వాతి శయం, స్వోత్కర్ష మొదలైన ఇతర దౌర్బల్యాలు ఆయన కున్నాయనీ తెలుసు. అయినా, ఆయన సమక్షంలో నేనెందుకో నోరెత్తలేను.

ద్రౌపది : నిజమే! ఆయనలో ఏదో సమ్మోహన శక్తి వున్నది. అదే నన్ను కూడా ఆయనకు వశవర్తినిగా చేస్తుంది.

అర్జునుడు: నీవు గమనించావో, లేదో - నన్ను నీవు అధికంగా ప్రేమిస్తావని తాను లోలోపల పడే బాధను అన్ని సమయాలలో ఆయన దాచుకోలేరు.

ద్రౌపది : అదొక్కటే కాదు, - చాలా విషయాలు గమనిస్తూ వుంటాను. మీకు తెలియక పోవచ్చుగాని, ఒక పుష్కరం పాటు అల్లంతదూరంనుంచైనా మిమ్ము కళ్లజూచుకోడానికి నేను నోచుకోలేనపుడు ఆయన లోలోన ఎంతో సంతోషించారు.

అర్జునుడు: అలాగా! కాని, నేను వనవాసానికి వెళ్ళనక్కరలేదని అప్పుడు నాకు చాలా చాలా చెప్పారు!

ద్రౌపది : ఏమేమి చెప్పారేమిటి?

అర్జునుడు: నీతో ఆయన శయ్యాగారంలో వుండగా నేను లోనికి ప్రవేశించింది క్షత్రియధర్మ పాలనకేనన్నారు. అప్పుడు నేను తిరిగి వచ్చి ఆయుధాలను తీసుకువెళ్లి వుండకపోతే, ఒక బ్రాహ్మణ కుటుంబం తన గోధనాన్ని కోల్పోయివుండే దన్నారు. చోరులబారి నుంచి భూసుర వర్గాన్ని రక్షించలేక పోయిన మహాపాపం తనకు చుట్టుకునేదన్నారు. నారదుని సూచనపై మేము పెట్టుకున్న విధి నిషేధాలకు వ్యతిరేకంగా నేను వెళ్ళానన్న ప్రశ్న ఈ పరిస్థితులలో అసలు ఉత్పన్నమే కాద న్నారు. ఏమైనా, ఈ విధమైన నిబంధనలను చిన్నవారి విషయంలో పెద్దవారు ఉల్లంఘిస్తే అది తప్పుగాని, చిన్నవారు ఆ పని చేస్తే అది దోషం కాదన్నారు. పన్నెండు సంవత్సరాలపాటు నేను తమకంటికి కనబడకపోతే....

ద్రౌపది : తాము సహించలేమన్నారు. (సంతాప ఘట్టంలో పడిన ధర్మరాజును అనుకరిస్తున్న ధోరణిలో ) ముఖం చిన్న బుచ్చుకున్నారు; తల కొట్టుకు న్నారు; కంట తడిపెట్టుకున్నారు; బిట్టు బిట్టు నిట్టూర్పులు గట్టిగట్టిగా విడిచారు....

అర్జునుడు: (చిరునవ్వుతో) ఆయనను చాలా చక్కగా అనుకరిస్తున్నావ్!

ద్రౌపది : (చిరుకోపంతో లేచి నిలబడి) అప్పటి నా బాధ తెలిస్తే మీకు నవ్వు లెందుకు వస్తాయి? ఆ పన్నెండేళ్లు మీ సహచర్య భాగ్యం నాకు తప్పింది. అప్పుడు ఆయన నాకేమి సూచించారో తెలుసా? ఒంటరి తనం నాకు దుస్సహం అయితే, తాము అగ్రజులైనందున, తమతో నేను కాలం గడపడం ధర్మసమ్మతమే కాగలదన్నారు! "నేను ధర్మంగా భావించినదాన్ని నీవు పాటిస్తే మా పార్థుడు ఎంతో సంతోషిస్తా" డన్నారు.

అర్జునుడు: నిజంగానా?

ద్రౌపది : కాదు, అబద్ధంగా! నా పిచ్చి భ్రమలేకాని, మీ అన్నదమ్ములందరూ ఇంతేనేమో!

అర్జునుడు: అదేమిటి? ఆయనపై కోపం నాపై మరలిస్తున్నావ్!

ద్రౌపది : చేసుకున్న కట్టుబాటును ఏ పరిస్థితులలో తప్పినా పాపం చుట్టుకోగ లదని పట్టుపట్టి, వనవాసం వెళ్లిన తాము తమ మాటను ఏ పాటిగా నిలుపుకున్నారు?

అర్జునుడు: ఏం? పన్నెండేళ్లు పూర్తిగానే నేను వనవాసం చేసిరాలేదా?

ద్రౌపది : కాని, ఆ పన్నెండేళ్లు బ్రహ్మచర్యం పాటించాలని కూడా నారదమ హర్షి కట్టుబాటులో లేదా? ఆ భాగాన్ని పాటి చారా? పైపెళ్లి చేసుకురాలేదా?

అర్జునుడు: ( అల్లరిగా లెంపలు వేసుకుంటూ) తప్పు చేశాను - మన్నించి!

ద్రౌపది : (బరువుగా) ఎవరిపై ఎక్కువగా మనసు పెట్టుకుంటామో వారే ఎక్కు వగా దూరం అవుతుంటారు - మరి అదేమి విధివైపరీత్యమో! (క్షణం ఆగి) ఏమైనా, మీ సాహచర్య భాగ్యం ప్రస్తుతానికి నాకు మరొక పక్షమైనా లేదు! వచ్చేది నా జీవితానికే అమావాస్య! తిరిగి పౌర్ణమి నాలుగేళ్ల తర్వాతే! అంతవరకు దినమొక యుగంగా గడపాలి.

అర్జునుడు: (లేచి ఆమె భుజంపై చేయి వేచి దగ్గరికి తీసుకుంటూ) నీకు దినమొక యుగంగా కదా, నాకు దినమొక కల్పం.

ద్రౌపది : (దూరానికి జరుగుతూ) అంత బాధ మీకు దేనికి? మిమ్ము రంజింప చేయటానికి మీ సుభద్ర వున్నదిగా! ఆమె నా కంటె వయసుకు చిన్న; అందచందాలకు మిన్న.

అర్జునుడు: ఆమె వచ్చిననాటి నీ కరుకు మాటలు మళ్లీ ఇన్నేళ్ల తరువాత...

ద్రౌపది : "ఆమె వచ్చిననాడు" కాదు; మీరుఅపహరించి తెచ్చిననాడు. ఆమె నీ హృదయాన్ని అపహరించబట్టే ఆమెను మీరు అపహరించుకు వచ్చారు!

అర్జునుడు: ఎలా వచ్చినా, రాగానే ఆమె మీ పాదాలకు మ్రొక్కలేదా? నీ చరణ దాసిగా వుంటాననలేదా?

ద్రౌపది : అది, వెనుక వుండి మీరాడించిన నాటకమేగా! సమయోచితంగా ఆ కాసేపు ఆమె చేత గొల్లభామ వేషం వేయించారులెండి! ఏమైనా అదృష్టమంటే ఆవిడదే. కనీసం ప్రపౌత్రుడు రారాజు కానున్నాడన్న సంతృప్తి ఆమెకు మిగిలింది. అటు చూసుకున్నా, నా బ్రతుకే సర్వనాశనమైపోయింది.

అర్జునుడు: మనం కామ్యకవనంలో వుండగా మన పరామర్శకై భర్త వెంట వచ్చిన సత్యభామకు సపత్నుల విషయంలో నీవు చెప్పిన నీతులు నీకు వర్తించవు కాబోలు!

(కన్నీరు నింపబోతున్నట్టు కనబడిన ద్రౌపదిని చెంతకు తీసుకుని) ఈ పూట నీవు అనవసరంగా వ్యధపెట్టుకుంటున్నావు. పద! కాసేపు ఉద్యానవనంలోకి పద! చల్లని వెన్నెలలో తిరిగితేనైనా నీ మనసు కొంత శాంతి పడుతుందేమో! (ఈ పలుకులను పలుకుతూనే పూలతోటవైపు ద్రౌపదిని భుజంపై చేయివేచి అర్జునుడు తీసుకువెడుతుండగా - తెర)

(తెర లేచినప్పుడు నకులుడు నిలువుటద్దం ముందు నిలిచి మీసాల కొసలను మెలి తిప్పుకుంటూ వుంటాడు. అవి తిన్నగా మెలితిరిగినట్టు సంతృప్తి కలిగిన పిమ్మట దువ్వెన అందుకుని గిరజాలను దువ్వుకుంటాడు. ఆ పైన చెక్కిళ్లకు సుగంధ లేపాన్ని పూసుకుంటాడు. నకులుని సౌందర్య పోషణ కృషి ఈ ఘట్టంలో వుండగా ద్రౌపది లోపలినుంచి ప్రవేశిస్తుంది. శయ్యాగారం వెనుకభాగంలో అద్దం ముందున్న నకులుని గమనించనందున సరాసరి భద్రాసనం వద్దకు వెళ్లి, దానిపై ఆమె కూర్చుంటుంది. ఒకటీ, రెండు నిమిషాల తర్వాత ఏదో అలికిడైనట్టు తోచగా వెనుదిరిగి చూస్తుంది. తన లోకంలోనే తానున్నట్టు నకులుడు కంటినొసలను కుడిచేతి మధ్య వేలుతో సవరించుకుంటూ వుంటాడు.)

ద్రౌపది : (చిరునవ్వుతో) ఎప్పుడు దయచేశారు? (పలకకుండా నకులుడు కలశంలో నుంచి సుగంధాన్ని తీసుకుని ముంజేతులకు పలచగా పులుముకుంటూ వుంటాడు.)

ద్రౌపది : వచ్చి ఎంతసేపైంది?

నకులుడు: (ఆమె వైపుకు చూడకుండానే)ఇంతకు ముందే!

ద్రౌపది : ఇంకా మీ సౌందర్య పోషణ కలాపం పూర్తి కానేలేదా?

నకులుడు: (అద్దంలో ముఖం చూచుకుంటూ) పూర్తి కావస్తున్నది.

ద్రౌపది : అందుకు మనకు దినారాత్రాలైనా చాలవులెండి!

నకులుడు: (అద్దంలో చివరిసారిగా ముఖం చూచుకొని, ఇవతలికి వస్తూ) అద్దాన్ని మార్చరాదా?

ద్రౌపది : మార్చడమెందుకు? - అది నిక్షేపంలా వుంటే!

నకులుడు: బొత్తిగా కళావిహీనమైపోయింది.

ద్రౌపది : అన్ని వేళలలో కాదు; తమరు సమక్షాన నిలిచినప్పుడే!

నకులుడు: అదేమిటి?

ద్రౌపది : తమ దివ్య సుందర విగ్రహాన్ని చూడగానే అసూయతో దాని ముఖం వివర్ణమైపోతుంది.

నకులుడు: (ముసి ముసి నవ్వుతో ద్రౌపది చెంతగా భద్రాసనంపై కూర్చుంటూ) అద్దానికి కూడా నేనంటే నిజంగానే కొంత అసూయ వుండవచ్చు.

ద్రౌపది : "అద్దానికి కూడా" అంటున్నారు. మరెవ్వరి కున్నదేమిటి?

నకులుడు: అది లేనివారెవరు?

ద్రౌపది : నాకు లేదే!

నకులుడు: నీకు వుండనక్కరలేదు.

ద్రౌపది : ఎందువల్ల?

నకులుడు: స్త్రీ జాతిలో సౌందర్యానికి నిన్ను మించినవారు లేరు కాబట్టి.

ద్రౌపది : పురుష జాతికి సంబంధించినంత వరకు ఆ ఘనత తమదే కాబోలు!

నకులుడు: (మీసంపై చెయ్యి వేసుకుంటూ) కాదా?

ద్రౌపది : (భయాన్ని నటిస్తూ) మీసం మెలివేస్తున్నారు - కొంప తీసి నాపై కత్తి దుయ్యరు కదా?

నకులుడు: (మీసంపై చేయిని చప్పున తీసివేసుకుంటూ) అంతభయం నీకక్కరలేదు!

ద్రౌపది : ఏమో, ఎలా నమ్మడం! మీ మూడవ అన్నగారు తమ గాండీవాన్ని దూషిస్తే సహించలేరు. మీ సౌందర్యాన్ని శంకించడం తమకు అంత కంటె దుస్సహం కావచ్చునేమో!

నకులుడు: నేను చెడ్డ కురూపినని నీవన్నా, నాకు కోపం రాదు.

ద్రౌపది : మా సోదరిక రేణుమతి ఆ మాట అన్నదనుకోండి!

నకులుడు: ఆమె అనదు!

ద్రౌపది : నిజమే! - ఆమె ఎందుకంటుంది? ఆ చేదిరాజపుత్రిక తమ సౌంద ర్యాన్ని చూచే తమను వరించినదయ్యే!

నకులుడు: నిజమే కాని...

ద్రౌపది : "నిజమే కాని?"

నకులుడు: నేను చాలా స్వయంవరాలకు వెళ్లాను. అయినా...

ద్రౌపది : అయినా?

నకులుడు: ఆ! ఏమీ లేదు.

ద్రౌపది : చెప్పబోయిన మాట మధ్యలో త్రుంచివేయడం దేనికి? నేను అన్యను కానుగదా!

నకులుడు: అన్యులకు నిశ్శంకోచంగా చెప్పే కొన్ని విషయాలను ఆత్మీయులకు చెప్పలేము. అలాగే ఆత్మీయులకు చెప్పే కొన్ని మాటలు అన్యులవద్ద బయట పెట్టలేము.

ద్రౌపది : సంతోషం! రాను రాను కొంత లోకజ్ఞులౌతున్నారు!

నకులుడు: నీకు కోపందేనికి? - చెబుతాలే! నేను చాలా స్వయంవరాలకు వెళ్లినా, ఒక్క రేణుక తప్ప మరెవ్వరు నన్ను వరించలేదు.

ద్రౌపది : నేను వరించాను గదా!

నకులుడు: నీవు నిజంగా వరించింది మా విజయుని మాత్రమే!

ద్రౌపది : ఓహో!

నకులుడు: మా విజయుడు ప్రతిస్త్రీని ఆకర్షిస్తాడు.

ద్రౌపది : మనస్సులో రెండవ సగాన్నే చెప్పారు; తమరు దాచిన మొదటి సగాన్ని నేను చెప్పనా?

నకులుడు: ఏమిటది?

ద్రౌపది : "నావలె ఆయన రూపసి కాకపోయినా......."

నకులుడు: ఆయన రూపసి కాకపోడు గాని........

ద్రౌపది : తమంత రూపసి కాదు!

నకులుడు: వెటకారంగా అంటున్నావా? నిజంగానేనా?

ద్రౌపది : (నవ్వుతూ) నిజంగానే!

నకులుడు: మా పార్థుడు మంచి పొడుగరి కావచ్చుగాని, నేనేమీ పొట్టివాడిని కాదుగా!

ద్రౌపది : మీరు పొట్టివారని ఎవరన్నారు?

నకులుడు: మహా అయితే నా కంటె ఆయన మరొక గుప్పెడు వుంటాడేమో! "కిరీటి" అనే బిరుదనామాన్ని నిలబెట్టుకోడానికి ఆయన మూరెడు కిరీటం పెట్టుకుంటాడు. దానితో మరింత పొడుగరిగా కనబడతాడు!

ద్రౌపది : (నవ్వుతూ) అయితే, మీరు బారెడు కిరిటాన్ని పెట్టుకోరాదా?

నకులుడు : హేళన చేస్తున్నావా?

ద్రౌపది : అబ్బే! లేదు!

నకులుడు: నీవు పొడగరిని కాదు; పొట్టీ కాదు. స్థూలం కాదు; సన్నమూకాదు. అందువల్లనే నీమూర్తి...

ద్రౌపది : మధ్య నాప్రశంస దేనికి లెండి! మీ సంగతి, మీ మూడవ అన్నగారి సంగతి చెప్పండి.

నకులుడు: నా వక్షస్థలం కంటె ఆయనిది ఏ కొంచెమో విశాలమైందే కావచ్చు కాని, మధ్య భాగం మరీ అంత సన్నం కావడం...

ద్రౌపది : ఔనౌను! అదీ ఒక వికార లక్షణమే ! ఆ నడుం సింహంనడుం కంటె సన్నం; ఆ చేతులు తొండంలాంటి పొడుగు; ఆ కాళ్ళు ఒంటెకాళ్ళ కంటె వంకర!

నకులుడు: ఇది నిశ్చయంగా నన్ను హేళన చేయడమే!

ద్రౌపది : హేళనేమిటి? - ఉన్నమాట అంటూవుంటే!

నకులుడు: ఏమైనా, ఆయన నలుపు కాదా? నీవు నలుపే అనుకో! అయినా, ఆయన కంటె ఒకటి, రెండు చాయలు పెచ్చు.

ద్రౌపది : మీ పదహారు వన్నెల పసిడి చాయ అందరికీ ఎలా వస్తుంది లెండి. అందుకు పెట్టిపుట్టాలి!

నకులుడు: నలుపైనా నీ ముఖం ఎంతో కళగా వుంటుంది!

ద్రౌపది : (దీర్ఘం తీస్తూ) అలాగా!

నకులుడు: నీ కారు నల్లని జుట్టు నీ ముఖానికి నురింత శోభ తెస్తూవుంటుంది!

ద్రౌపది : (తిరిగి దీర్ఘం తీస్తూ) అలాగా!

నకులుడు: మా మూడవ అన్నగారికి కూడా నల్లని జుట్టే! పైగా తెగ బారెడు! అందువల్లనే బిరుదాలు చాలవన్నట్టు, "గుణకేశు"డంటూ ఆయనకు మరొకదాన్ని తగిలించారు. నాదే పాడు జుట్టు! ఎంత అణగదువ్వినా, అంతలో తిరిగి నిక్కబొడుచుకుంటుంది.

ద్రౌపది : జిగురు ఏదైనా వాడి చూడక పోయారా?

నకులుడు: జిగురు కాదు గాని, చాలా తైలాలను వాడాను. జుట్టు రాలిపోయి పలుచబడి పోవడం తప్ప వాటి వల్ల ప్రయోజనం కనబడలేదు. జుట్టు పలచబడే సరికి, వయస్సు ముదిరి పోయినట్టు కనబడుతున్నాను కాదూ?

ద్రౌపది : అబ్బే! లేదు! స్వయంవరాలకు వెళ్ళదగు వయస్సులో ఇంకా వున్నట్టే నాకంటికి కనబడుతున్నారు.

నకులుడు: ఆ! నేను స్వయంవరాలకు వెళ్ళినా, వెళ్ళకపోయినా ఒకటే! మా విజయుడు స్వయంవరాలకు కాక, తీర్థయాత్రలకు వెళ్ళినా, ఉలూచి, చిత్రాంగదలు ఆయనను వరించారు. సుభద్రాదేవి కూడా వరించే వుండాలి. లేకపోతే ఆమెను స్వజనం మధ్యనుంచి అంత సులభంగా అపహరించుకు రాగలిగేవాడా?

ద్రౌపది : (వస్తున్న నవ్వు ఆపుకుంటూ) తీర్థయాత్రలకు కాక, తాము జైత్ర యాత్రలకు వెళ్ళినా, తమను వరించిన భామే లేకపోయింది! మన రాజసూయ సందర్భంలో తమ జైత్రయాత్ర సామాన్యమైందా? ఎదురు నిలిచిన రాజులందరిని వరసపెట్టిఓడించారు! వారి కోశాగారాలను కొల్ల గొట్టి, పదివేల లొట్టిపిట్టలపైన ధన కనక వస్తురాసులను తరలించుకు వచ్చారు! చక్కని రూపురేఖలతో పాటు గొప్ప శౌర్యప్రతాపాలున్నట్టు తమరు ఇంతగా నిరూపించుకున్నప్పటికైనా, ఏ ఉలూచి, ఏ చిత్రాంగద, ఏ సుభద్ర తమరిని వలచి వెంటబడలేదు. మా పాడు స్త్రీ జాతికి కళ్లు లేవు సరిగదా, మెదడైనా లేదు!

నకులుడు: (ద్రౌపది పలుకులలోని వ్యంగాన్ని గుర్తించలేక, తన ధోరణిలో తాను) మా రెండవ అన్నయ్య వెళ్ళక, వెళ్ళక ఒకే ఒక స్వయంవరానికి వెళ్ళగా, కాశీ రాజపుత్రిక ఆయనను వరించింది.

ద్రౌపది : జగన్మోహనులైన తాము సయితం ఆ స్వయంవరానికి వెళ్ళారు. అయినా, ఆ వృకోదరునే ఆమె వరించింది!

నకులుడు: (తలపంకిస్తూ) తక్కిన వారి మాటకేమిగాని, నీ విషయంలో ఆది నుంచీ నన్నొక సందేహం పీడిస్తున్నది సుమీ!

ద్రౌపది : ఓహో! ఎన్నడు చెప్పలేదేమి?

నకులుడు: ఎన్నోసార్లు చెప్పబోయి, మాట నాల్కచివరికి వచ్చిన మీదట సంక్షే పిస్తూ పోయాను.

ద్రౌపది : పోనీ, ఇప్పుడు చెప్పరాదా?

నకులుడు: చెబితే నాపై కోపం రాదు గదా?

ద్రౌపది : రావడం, రాకపోవడం మీరు వెలిబుచ్చే సందేహాన్ని బట్టి వుంటుంది.

నకులుడు: అయితే చెప్పను!

ద్రౌపది : లోపలనే మీరు దాన్ని దాచుకుంటే, ఇక మీదట అది నన్ను కూడా పీడిస్తుందేమో! -చెప్పండి!

నకులుడు: ఏమంత పెద్ద సందేహం కాదుగాని...

ద్రౌపది : ఉపోద్ఘాతలు దేనికి? - చెప్పండి!

నకులుడు: నా రూపాన్ని గురించిన ప్రసక్తి వచ్చినప్పుడు నీవు నన్ను నిజంగా హర్షిస్తున్నావో, అపహసిస్తున్నావో తెలియదు!

ద్రౌపది : (నవ్వి) పెద్ద ధర్మ సందేహమే వచ్చింది. మీ పాండవాగ్రజులనడిగి తేల్చుకొనలేకపోయారా?

నకులుడు: ఆయన నడిగి లాభం లేదు.

ద్రౌపది : ఎందువల్ల?

నకులుడు: నీవు గమనించావో, లేదో గాని మన మందరం కలిసివున్నప్పుడు నీ చూపు నాపై నిలిస్తే చాలు - ఆయన కళ్ళలో కొంత అసూయ కనబడుతుంది!

ద్రౌపది : (కొంత చురుకుగా) తప్పు లెన్నడానికి ఆ ధర్మప్రభువులో తమ్ములు నలుగురికి తలొక కారణం కనిపిస్తుంది! ఇది ఆయన దౌర్భాగ్యం!

నకులుడు: ఆయనంటే మాకు భక్తి గౌరవాలు లేవనుకోకు! దైవసమానునిగా ఆయనను మేము పూజిస్తాము!

ద్రౌపది : ఔను! ఎదుట పూజిస్తారు; చాటున విమర్శిస్తారు!

నకులుడు: నీకు కోపం రానే వచ్చింది.

ద్రౌపది : మీ మాటలకు రాదా!

నకులుడు: మన్నించు. (కొన్ని క్షణాలపాటు ఉభయులు మౌనంగా వుంటారు.)

ద్రౌపది : (చిరునవ్వుతో) ఆలోచనాముద్ర ధరించినప్పుడు మీ ముఖం మరింత అందంగా వుంటుంది. (ముఖాన్ని నకులుడు ఒక వెగకు తిప్పుకుంటాడు)

ద్రౌపది : ఒక కోణం నుంచి చూచినప్పుడు మరింత మనోహరంగా వుంటుంది.

నకులుడు: (చప్పున ఆమెవైపుకు తిరిగి) ఈ మాటలే నన్ను బాధపెట్టేవి!

ద్రౌపది : మీ ముఖారవిందాన్ని మెచ్చుకుంటే మీకు బాధ దేనికి?

నకులుడు: అది మెచ్చుకోలు కావచ్చు. ఎగతాళి కావచ్చు.

ద్రౌపది : మన అరణ్యవాసానికి పూర్వమే ఇంద్రప్రస్థంలో మీతో ఒక మాట అన్నాను - అది జ్ఞాపకం లేదా?

నకులుడు: ఏమిటది?

ద్రౌపది : మీకు రూపం వున్నా, రసికత్వం లేదని, ఆ మాటకు కినిసి ఒక వారం పాటు మీరు నావంకైనా చూడలేదు. ఆ తర్వాతనైనా ఆవిధంగా నేనెందుకన్నానో అడిగి తెలుసు కొనడానికి మీరు ప్రయత్నించలేదు.

నకులుడు: సరే - ఇప్పుడడుగుతున్నాను - ఎందుకన్నావు?

ద్రౌపది : రసికుడైనవాడు తన రూపాన్ని భార్య ఎంత మెచ్చుకుంటున్నదో ఆమె నోటి ద్వారా వినగోరడు; ఆమె కళ్ళలోకి చూచి తెలుసుకుంటాడు!

నకులుడు: మరి రేణు నాతో అంటుందే? - మీరు నవమన్మధులని, నలకూబేరులని.

ద్రౌపది : నా సోదరి గడసరి! మీ దౌర్బల్యం ఆమెకు తెలుసు.

నకులుడు: (తలపంకిస్తూ) నీవు నన్ను అపహాస్యం చేస్తుంటే ఆమె ముఖస్తుతి చేస్తున్నది కాబోలు!

ద్రౌపది : (నవ్వి) అశ్వహృదయం తెలిసినంతగా మీకు నారీ హృదయం తెలియదు!

నకులుడు: అశ్వాలు నేనంటే ప్రాణాలు విడుస్తాయి; అతిఫల మెప్పునే పొందలేక పోతున్నాను.

ద్రౌపది : అద్దం ముందు కూర్చోవడం కాస్త తగ్గిస్తే, చాలా మెప్పు వస్తుంది!

నకులుడు: ఇతరులు నా రూపును మెచ్చుకోనప్పుడు నేనైనా మెచ్చుకోరాదా?

ద్రౌపది : అద్దం మెచ్చింది అందం కాదు; అతివ మెచ్చిందే అందం!

నకులుడు: (ఆమె కళ్ళలోకి చూస్తూ) నీ కళ్ళలో నాకు మెచ్చుకోలు కనబడ్డం లేదు.

ద్రౌపది : (చిరునవ్వుతో) అది కనబడాలంటే ఎప్పుడు చూడాలో, ఎలా చూడాలో తెలిసివుండాలి. అశ్వవిద్య కంటె ఇది కష్టసాధ్యమైన విద్య!

నకులుడు: నేనంత మూర్ఖుడనా?

ద్రౌపది : కాదు, నవయువకులు! కౌమారావస్థను దాటి, ఇప్పుడే యవ్వన ప్రాంగణంలో పాదం పెడుతున్నారు!

నకులుడు: ఇంత వయస్సు వచ్చినా, ఇంకా నేను నవయువకుడనా?

ద్రౌపది : ఔను! కొందరు జన్మతోనే వృద్ధులైనట్టు, కొందరు ఎంత వయస్సు వచ్చినా బాలకుమారులుగానే మిగులుతారు. వయస్సు ముఖ్యం కాదు; చిత్తవృత్తి ముఖ్యం. మీ పాండవాగ్రజులకు శైశవావస్థ వున్నట్టు మీరనా. ఆ మాట నమ్మడం నాకు కష్టం. పుట్టుకతోనే ఆయన శాంత బుద్ధితో పుట్టారు. (చిరునవ్వుతో) అలాగే మీరు... ఎందుకు లెండి. అనవసరమైన పోలికలు!

నకులుడు: ఎంత వయస్సు వచ్చినా నాకు పరిణత బుద్ధి రాదంటావు - అంతేనా?

ద్రౌపది : మీరెంత సూక్ష్మగ్రాహులండీ! (ఈ మాటలంటూ ఆమె నకులుని తలను ఒడిలోకి లాక్కుని అతని జుట్టును గజిబిజిగా రేపుతుంది.)

నకులుడు: (తప్పించుకుని లేచి) జుట్టు రేపి వేశావ్! జుట్టు రేగినా, బట్ట మాసినా నాకు కంపరం! (అద్దం వద్దకు దారితీయబడతాడు)

ద్రౌపది : (దారికి అడ్డు నిలిచి) మళ్లీ అద్దం వద్దకు వెళ్లడానికి వీల్లేదు!

నకులుడు: ఎందువల్ల?

ద్రౌపది : చెరిగిన జుట్టుతో నలిగిన బట్టలతో మిమ్మ చూడ్డమే నాకు ముచ్చట!

నకులుడు: మాసిన గడ్డంతో కూడానా?

ద్రౌపది : ఔను!

నకులుడు: నీ పలుకులు నాకు చిత్రంగా వున్నాయి!

ద్రౌపది : నారీ హృదయమే చిత్రమైనది!

నకులుడు: దాని రహస్యాలు నాకు విప్పి చెప్పరాదా?

ద్రౌపది : చెప్పకుండా వాటిని తెలుసుకునే వాడే రసికుడు!

నకులుడు: నా మనస్సును తిరిగి నొప్పిస్తున్నావ్!

ద్రౌపది : మెప్పులేని భార్య పతిని నొప్పించదు, నిర్లక్ష్యం చేస్తుంది.

నకులుడు: నీకు కష్టంకలిగినా సరేగాని, నీవు నన్ను నిర్లక్ష్యం చేస్తున్నావనే నా నమ్మకం

ద్రౌపది : (నొసలెగరేస్తూ) అలాగా!

నకులుడు: ఏనాడూ నాకోసం నీవు అలంకరించుకొావు!

ద్రౌపది : నా బదులు మీరలంకరించికుంటున్నారుగా!

నకులుడు: (చిన్నబుచ్చుకున్న ముఖంతో) తిరిగి అపహాస్యం!

ద్రౌపది : అలంకరణతో నిమిత్తం లేనిదే నిజమైన అందమని మీకెన్నటికి తెలుస్తుందో!

నకులుడు: నాకిది తెలియజెప్పడామికేనా నీ వలంకరించికోంది!

ద్రౌపది : ఈనాటికైనా ఈ ప్రశ్న మీకు తోచింది - సంతోషం!

నకులుడు: సహజ సౌందర్యమైనా అలంకరణతో పెరగదా?

ద్రౌపది : మితిమీరితే తమ వంటి మన్మథాకారులనైనా అది మర్కటాలను చేస్తుంది.

నకులుడు: సరే! రేపటి నుంచి స్నానమైనా చెయ్యను!

ద్రౌపది : దేనిలోనూ అతి తగదు! రండి - కూర్చోండి. (నకులుడు కూర్చున్న పిదప సరసన కూర్చుంటూ) స్త్రీలైనా, పురుషులైనా తమ తమ వయస్సులకు తగినట్టు మెలగాలి. ఈ వయస్సులో నేను కొత్త పెళ్లి కూతురువలె కనబడ్డానికి ప్రయత్నించడం కంటె వికార చేష్ట వుంటుందా?

నకులుడు: ఏమైనా, నారీ హృదయం లోతులు నాకు తెలియవని ఇప్పడిప్పడే అర్థమౌతున్నది. ఎంత వికారినైనా కొందరు ప్రేమిస్తారు; మరి వారిలో తమ కేమి అందం కనబడుతుందో!

ద్రౌపది : (చిరునవ్వుతో) ముక్కు తీరు, ముఖం తీరు - ఇవేనా ఆకర్షించేది? ప్రేమకు పట్టుకొమ్మ కావడానికి చూపులోని తళుకు చాలదా? గొంతులోని తేనె చాలదా? నవ్వులోని కవ్వింపు చాలదా? నా పలుకులు కలిగిస్తున్న మనో వికారాలతో క్షణక్షణ పరివర్తనలు పొందుతున్న మీ వదనం ఇప్పుడు నన్నెంతగా ఆకర్షిస్తున్నదో మీకెలా తెలుస్తుంది? (నకులుని గిరజాలను ఆమె తిరిగి గజిబిజి చేస్తుండగా - తెర)

(పైకి తెర లేచినప్పుడు సహదేవుడు క్రోధ విచారాలతో కూడిన వదనంతో నడయాడుతూ వుంటాడు. అదాదున కాలికొక బల్ల తగలగా, దాన్ని తన్ని వేస్తాడు. దానిపై వున్న చిన్న చిన్న శిల్పాలు వెళ్లి దూరంగా పడతాయి. ఆ చప్పుడు విన్న ద్రౌపది లోపలి నుంచి త్వరగా ప్రవేశిస్తుంది)

ద్రౌపది : (కింద పడివున్న ఒక శిల్పాన్ని ఒక తాపు తన్నుతున్న సహదేవుని చూచి, ఆగిపోయి, చిరునవ్వుతో) ప్రళయకాల రుద్రుని వలె వున్నారు! ఏమిటి విశేషం? (మరొక శిల్పాన్ని తన్నడానికి సహదేవుడు పాదం ఎత్తుతాడు.)

ద్రౌపది : (చికాకుగా) సంతోషించాముగాని, మరి నిదానించండి! (ఎత్తిన పాదాన్ని ఎత్తినట్టే వుంచి, సహదేవుడు ఆగిపోతాడు)

ద్రౌపది : (చిరునవ్వుతో) ఈ దృశ్యం మన రాజసూయ యాగాన్ని జ్ఞప్తికి తెస్తున్నది. కృష్ణునికి అర్ఘ్యమిచ్చినందుకు ధర్మ రాజులపై అలిగిన నృపది లోకం శిరస్సుపై పెట్టడానికి ఇంతటి కోపావేశాలతోనూ ఆనాడు మీరు పాదమెత్తారు! చూడ్డానికి ముచ్చటగా వున్నది - ఆ పాదాన్ని అలాగే ఎత్తిపట్టి వుంచండి! (సహదేవుడు చివాలున తన పాదం దించి వేసుకుంటాడు.)

ద్రౌపది : (దగ్గరికి వస్తూ) సరేగాని ఎందుకింత కోపం? ఎవరిపై కోపం? (సహదేవుడు మారు పలకడు.)

ద్రౌపది : (మరి నాలుగడుగులు ముందుకు వేసి) మీ కోపతాపాలను చూపవలసింది ఈ శిల్పాలపైనా? ఇవి మిమ్మేమి చేశాయి? (బల్ల సరిగా తీసి, వంగి అందుకుంటున్న శిల్పాలను దానిపై తిరిగి పెడుతూ) ముద్దులొలికే ఈ బొమ్మ ముక్కు విరిగి పోయింది - చూచారు? ఎంతటి కోపంలోనైనా ఇలాంటి చికాకుపనులు తగవు. (శిల్పాలన్నింటిని సరిగా సర్దుతూ) బల్ల కాలికి తగిలిందా? ముందుకు పడిపోలేదు గదా? దెబ్బ తగలలేదు గదా?

సహదేవుడు: లేదు.

ద్రౌపది : అయితే, ఈ పిచ్చి కోపమెవరిపై?

సహదేవుడు: ఆ గర్విష్టి, ఆ జూదరి, ఆ కపటి...

ద్రౌపది : (తీవ్రంగా) చాలు! మరి కట్టి పెట్టండి! (అతడు చప్పున తగ్గిపోయి, భద్రాసనంపై కూలబడి, రెండు చేతులతో ముఖం కప్పుకొని, పొరలి వస్తున్న సోకాన్ని కప్పి పుచ్చుకొనడానికి ప్రయత్నిస్తాడు.)

ద్రౌపది : (అర నిమిషం పాటు అతనిని చూస్తూ మౌనంగా నిలిచిన మీదట, దగ్గరికి వెళ్లి, తల నిమురుతూ) అన్ని ఉరుములు, మెరుపులు తర్వాత ఈపాటి వాన చినుకులు తప్పవులెండి!

సహదేవుడు: (నెమ్మదిగా తలయెత్తి, సానుభూతి కోసం ఆమె కళ్లలోకి చూస్తూ) ఇక నేను బ్రతికీ, చచ్చీ ఒక్కటే!

ద్రౌపది : ఏమి జరిగింది?

సహదేవుడు: దాన్ని చెప్పుకోడానికైనా సిగ్గుపడాలి.

ద్రౌపది : చిన్న పిల్లవాని వలె గొడవ చెయ్యక నాకు చెబుదురూ!

సహదేవుడు: నీవు కూడా నన్ను చిన్నపిల్లవాని వలె చూస్తున్నావన్న మాట

ద్రౌపది : ఔను! "నా ముద్దులకొడుకు! జాగ్రత్తగా చూచుకో!" అని కుంతీదేవి మిమ్ము నాకు ఇల్లడపెట్టలేదా? ఇంతకీ ఏమి జరిగిందో చెప్పండి.

సహదేవుడు: ఆ! ఏమీ లేదు, ఉద్యానం గుండా నేనిటు వస్తుంటే ఆయన పిలిచారు. తప్పదుగాబట్టి...

ద్రౌపది : ఆయనకు ఊరూ పేరూ లేదేమిటి?

సహదేవుడు: (వినిపించుకోకుండా) తప్పదుగాబట్టి, అటు వెళ్లాను. తమ వెంటన న్నొక నాల్గు గడియలు తిప్పుతూ తమ సహజధోరణిలో నాకు ధర్మో పన్యాసమిచ్చారు. ఏ పూట దాన్ని తినేవారు లభించకపోతే, ఆ పూట ఆయనకు అన్న హితవు తప్పుతుంది!

ద్రౌపది : ఆ ధర్మ ప్రభువుల పట్ల ఇది మహాపచారం!

సహదేవుడు: ధర్మాధర్మాలు తమ కంటె నాకే బాగా తెలుసు. తమ దీర్ఘోపన్యా సాలతో నన్ను చంపడం దేనికి?

ద్రౌపధి : ఇంత మాత్రానికేనా ఈ పూట మీరింతగా చిందులు త్రొక్కడం!

సహదేవుడు: మరి చాలా జరిగింది!

ద్రౌపది : అలాగా!

సహదేవుడు: ఔను! గ్రుక్క తిప్పుకోకుండా ఆయన నాకు ధర్మోపన్యాసమిస్తుండగా, నా ఖర్మం కాలి, ఎవడో జటాధారి ఎక్కడినుంచో హఠాత్తుగా ఊడిప డ్డాడు. వాడిని అర్ఘ్యపాద్యాలతో సత్కరించమంటే సత్కరించాను. ఆపైన వాడు...

ద్రౌపది : తాపసులను "వాడువా" డనడం తప్పు కాదా?

సహదేవుడు: మీసాలు గడ్డాలు పెంచిన ప్రతివాడు ఒక తాపసుడౌతాడా?

ద్రౌపది : ఎవరిలో ఏ మహాత్మ్యం వుంటుందో మనకెలా తెలుస్తుంది!

సహదేవుడు: తెలియదని, ప్రతి గడ్డపువాడిని ఒక గద్దె నెక్కించి కూర్చోబెట్టగలమా?

ద్రౌపది : పెద్దలపట్ల ఈ దూషణ తిరస్కారాలు తగవు.

సహదేవుడు: వాడేనా ఒక పెద్ద, వాడికి వాక్శుద్ధి అయినా లేదు.

ద్రౌపది : ఈ ధోరణిలో మాట్లాడుతూపోతే తమ వాక్శుద్ధిని నేను శంకించవలసి వస్తుంది. సరే! ఆ తర్వాత ఏమి జరిగింది?

సహదేవుడు: ఏవో అవాకులు చవాకులు ఆ చవట ప్రేలుతూ పోతుంటే ఈయన చిత్తం! చిత్తం!" అంటూ భక్తి వినయాలను ప్రదర్శిస్తూ పోయారు. విని విని మరి భరించలేక, వాడిపై నేను రెండు విసుర్లు విసిరి, వాడి నోరు కట్టించే సరికి, ఈయన నన్ను నానా చివాట్లు పెట్టి, ఆ త్రాష్టుడికి నాచే క్షమాపణ చెప్పించారు.

ద్రౌపది : ఆయన ఎట్టివారైనా మన అతిథి. అతిథిని అమర్యాద చేస్తే నేనైనా క్షమాపణ చెప్పించేదాన్నే!

సహదేవుడు: పోనీ అని నేను క్షమాపణ చెప్పాను. అంతటితో నైనా నన్ను విడిచిపెడితేనా? వాడికి సాష్టాంగ పడమన్నారు. ఇది దుస్సాహం!

ద్రౌపది : అన్నగారి మాటప్రకారం చేసే వచ్చారా? చేయకుండా వచ్చారా?

సహదేవుడు: ఇకమీదట చేసేది లేదు.

సహదేవుడు: (చిరునవ్వుతో) ఇక మీదటి మాట ఇప్పుడు దేనికిలెండి!

సహదేవుడు: నా కృతనిశ్చయం ఎన్నటికీ మారదు.

ద్రౌపది : ఔనౌను! ఆయన తిరగి ఆదేశించేవరకు! ఆ ధర్మప్రభువులు సమక్షంలో లేనప్పుడే మన ధిక్కారణ!

సహదేవుడు: "నా నోట అనృతం రాదు! నా మనస్సులో పాపచింత పెట్టదు" అని నాకై నేను అదేపనిగా చెప్పకుంటూ పోతే నేను మాత్రం ఒక ధర్మప్రభువును కానా?

ద్రౌపది : ఆత్మస్తుతివల్ల ఎవరైనా గొప్పవారౌతారా?

సహదేవుడు: అదే చాలదు. మరొకటి కూడా కావాలి.

ద్రౌపది : ఏమిటది!

సహదేవుడు: పరనింద.

ద్రౌపది : (అల్లరిగా) అయితే త్వరలోనే తాము చాలా చాలా గొప్పవారుగా చెల్లబోతున్నారు.

సహదేవుడు: ఈ జన్మకు ఈ సహదేవునికి అంత భాగ్యం పట్టదు!

ద్రౌపది : లేకపోవడ మేమిటి? ప్రస్తుతం కొనసాగిస్తున్న పరనిందకు ఆత్మస్తుతిని జోడించండి!

సహదేవుడు: దేనికిదేన్ని జోడించినా, నా విషయంలో ప్రచారం నిరర్థకం.

ద్రౌపది : ఎందువల్ల?

సహదేవుడు: ప్రచారం వల్ల సులభంగా అల్లుకుపోయేది అబద్ధమే - నిజం కాదు, అబద్ధం ఎంత పెద్దదైతే అంత సులభంగా ఈ పాడులోకం దాన్ని నమ్ముతుంది.

ద్రౌపది : లోకం అంత గుడ్డిదా?

సహదేవుడు: గుడ్డిది మాత్రమే కాదు, చెవిటిది, కుంటిది, మూగది, పిచ్చిది.

ద్రౌపది : ఈ పూట ఇంత విడ్డూరంగా మాట్లాడుతున్నారే!

సహదేవుడు: గిట్టనిదానికి మనం చెడ్డ పేరు పెడతాము. వివేకమంటే మనకెంత మాత్రం గిట్టదు. అందువల్లనే దాన్ని విడ్డూరం అనివేస్తాము. నీకే కాదు; మీ ధర్మ ప్రభువులకు సయితం నా పలుకులు విడ్డూరంగానే తోస్తూ వుంటాయి.

ద్రౌపది : "మీ ధర్మ ప్రభువు" లంటున్నారు; తమ దృష్టిలో వారు ధర్మ ప్రభువులు కారు?

సహదేవుడు: కాకేమి? వివేకమొక్కటే శూన్యం కాని, ఆయన ధర్మ ప్రభువులే.

ద్రౌపది : అదుగో! తిరిగి ఆయనను నిందిస్తున్నారు. దీన్ని మరి సహించేది లేదు.

సహదేవుడు: అదే ఆయనకు పట్టిన అదృష్టం! ఎవరిని చూడబోయినా, ఆయనను వెనక వేసుకు వచ్చేవారే!

ద్రౌపది : ఎందుకు రారు? - ఆయన ధర్మానికే ప్రభువైనప్పుడు! ఆయన ప్రతి పలుకు ఒక ధర్మసూక్తి!!

సహదేవుడు: శైశవంలో గురుపాదాల వద్ద నేనూ నేర్చుకున్నాను, "సత్యం వద, ధర్మం చర" అంటూ చాలా నీతుల్ని, మాటలు నేర్చిన చిలకవలె వాటిని వల్లించడానికి వివేకం అక్కరలేదు.

ద్రౌపది : వివేకం మీలోనే మూర్తీభవించిందని మీ భ్రమ! ఆయనెంత వివేకవంతులో మీకేమి తెలుసు!

సహదేవుడు: నిజమే! పరమ మూర్ఖునికి ఏమీ తెలియదు! పరమ మూర్ఖుడైనందువల్లనే ఇతడు శకునితో ద్యూతానికి సమ్మతించాడు.

ద్రౌపది : చీటికీ, మాటికీ ద్యూతం ప్రసక్తి తెచ్చి ధర్మ ప్రభువులను మీరు వెక్కిరించనక్కరలేదు. మీకు తెలియదేమో గాని, ద్యూతానికి ఆహ్వానిస్తే క్షత్రియుడైనవాడు దాన్ని తిరస్కరించ రాదు. ఇది మన క్షత్రియకుల సంప్రదాయం.

సహదేవుడు: అయితే, ద్యూతానికి పిలిచిన దెవరు? ధృతరాష్ట్రుడు కాడా? అయినప్పుడు శకునితో ఎందుకు ఆడవలసి వచ్చింది?

ద్రౌపది : చాలా తెలివైన ప్రశ్నే! కళ్లులేని ఆ ధృతరాష్ట్ర మహారాజు కావాలన్నా ద్యూత మాడగలడా?

సహదేవుడు: ఆహ్వానం ఒకరినుంచి కాగా, ఆట మరొకరితో - ఇది కూడా క్షత్రియ సంప్రదాయమేనా? కళ్లులేని ధృతరాష్ట్రుడు మరొకనిని నియోగించినప్పుడు...

ద్రౌపది : మరొకరిని నియోగించింది దుర్యోధనుడు!

సహదేవుడు: సరే! దుర్యోధనుడే! పాచికలను పట్టడం తనకు చేతకాదని దుర్యోధనుడు మరొకరిని నియోగించినవుడు, వాటిని పట్టడంలో తనకు తగినంత నేర్పు లేదని మీ ధర్మప్రభువులు మరొకరిని ఎందుకు నియోగించలేదు?

ద్రౌపది : ఆయనకు నేర్పు లేకపోవడమేమిటి? శకుని మోసం చేసినందువల్లనే ఓడిపోయారు.

సహదేవుడు: అయితే, "నీవు మోసం చేస్తున్నావ"ని అతడిని వెంటనే ఎందుకు అల్లరి పెట్టలేదు? కౌరవ సభలోని పెద్దలచేత అతడికి ఎందుకు బుద్ధి చెప్పించలేదు?

ద్రౌపది : కానరాకుండా అతడు మోసం చేశాడు.

సహదేవుడు: ప్రతి జూదగొండి తానోడిపోయిన తర్వాత ప్రత్యర్థి మోసం చేసినందువల్లనే తానోడిపోయినట్టు చెబుతాడు.

ద్రౌపది : శకుని మోసం చేయలేదని మీరు నిజంగానే నమ్ముతున్నారా?

సహదేవుడు: నా మాటకేమిగాని, సాక్షాత్తు ఆ భీష్మ పితామహులేమన్నారు? ద్యూతంలో శకునికి సాటిరాగలవాడు ఈ భూమండలంలోనే లేడని అనలేదా? అయినా, స్వచ్ఛందంగా మన యుధిష్ఠరులు అతనితో ద్యూతాన్ని సాగించారని అనలేదా? అతని చేతిలో తానోడిపోయినట్టు స్వయంగా గుర్తించారని అనలేదా?

ద్రౌపది : ఆ! అవి తెలిసీ తెలియని మాటలు!

సహదేవుడు: పోనీ, శకుని నిజంగానే మోసం చేశాడనుకో; అయినప్పుడు రెండవ సారి అతడితోనే ద్యూతానికి ఎందుకు సమ్మతించినట్లు? తిరిగి అతని చేతిలో ఎందుకు ఓడిపోయినట్టు? ఒకసారి మోసం చేసినవాడే మరొకమారు కవ్వించినా, వానితో ద్యూతాన్ని తిరస్కరించరాదని క్షత్రియసంప్రదాయం నిర్దేశిస్తున్నదా? (సముచిత సమాధానం స్ఫురించక ద్రౌపది ఆలోచనలో పడుతుంది.)

సహదేవుడు: సమాధానం కోసం నీవు ఆలోచించనక్కరలేదు. మీ ధర్మప్రభువులు ద్యూత ప్రియులు. ఎప్పుడైనా, ఎక్కడైనా, ఎవరితోనైనా, ఎన్నిమారులైనా -పిలవనిదే పాపంగా - ఆయన ద్యూతానికి దిగగలరు; చివరికి నిన్నైనా! శకుని మోసం చేసి గెలవలేదు; పాచికలను విసరడంలో...

ద్రౌపది : మరి ఎలా గెలిచాడు?

సహదేవుడు: నే చెప్పబోయింది అదే! ఇంతలో నా మాటకు అడ్డు వచ్చావ్. పాచికలను విసరడంలో అతనికున్న నేర్పులో ఆవగింజలో అరవయ్యోవంతు కూడా మీ ధర్మ ప్రభువులకు లేదు. శకుని చేతిలో రెండుసార్లు తుక్కు తుక్కుగా ఓడిపోయిన తర్వాతనే కాదా, మన అరణ్యవాస కాలంలో బృహదశ్వ మహర్షి వద్దపాచికలను విసరడంలో గల మెలకువలను మీ ధర్మ ప్రభువులు కొంతవరకు తెలుసుకున్నది! మహర్షులైన వారికి ఆ విద్యలో ఏ మాత్రం ప్రావీణ్యం వుంటుందో సందేహమే! అందువల్ల దానిలో ఇప్పటికైనా శకునిదే పై చేయి కావచ్చు. పిచ్చివాడై దుర్యోధనుడు కురుక్షేత్ర యుద్ధానికి తలపడ్డాడుగాని, మీ ధర్మప్రభువులను తిరిగి ద్యూతానికి పిలిచివుంటే, మన మధ్య ఈ సంభాషణ ఈ హస్తినాపురాణ్మందిరంలో కాక ఏ మహారణ్యంలోనో జరుగుతూ వుండేది.

ద్రౌపది : ఈ భయంతోనే కాబోలు, పనికట్టుకుని మరీ ఆ శకునిని తాము యుద్ధంలో చంపింది!

సహదేవుడు: ఔను! లేకపోతే మీ ధర్మప్రభువుల ద్యూత ప్రియత్వం నుంచి మనకు రక్షణ వుండేది కాదు!

ద్రౌపది : ఈ వెక్కిరింపులే, ఈ వెటకారాలే తమ వివేకానికి తార్కాణాలా?

సహదేవుడు: నీ మాట నేనెందుకు కాదనాలి, ఇవే నా వివేకానికి తార్కాణాలనుకో! కాని మీధర్మప్రభువుల వివేకానికి నీవు చూపగల తార్కాణమేమిటో? మన సర్వస్వాన్ని బలిపెట్టి, కురుక్షేత్రంలో సాధించిన విజయాన్ని చివరిక్షణంలో దుర్యోధనుని చేతిలో పెట్టబోవడమా?

ద్రౌపది : మీరేమి మాట్లాడుతున్నారో మీకే అర్థం కావాలి; నాకు కావడం లేదు!

సహదేవుడు అయితే, వివరిస్తానులే! కురుక్షేత్రం నుంచి పారిపోయిన దుర్యోధనుడు నీటి మడుగు కింద వున్న సౌరంగంలో తలదాచుకోలేదా?

ద్రౌపది : ఔను!

సహదేవుడు: మా నిష్ఠుర వాక్కులను మరి సహించలేక దాని నుంచి వెలుపలికి వచ్చిన దుర్యోధనునితో మీ యుధిష్ఠర ప్రభువులు ఏమన్నదీ నీవు విన లేదేమో!

ద్రౌపది : వినకేమి? - విన్నాను. "మా సోదరులైదుగురిలో నీవు కోరిన వానితో, నీవు కోరిన ఆయుధంతో పోరాడవచ్చు" నన్నారట.

సహదేవుడు: అంతేకాదు. "ఈ పోరులో నీవు గెలిస్తే, రాజ్యం నీదే" అనికూడా అన్నారు.

ద్రౌపది : అది యుధిష్ఠర ప్రభువుల అంతస్తునే తెలుపుతున్నది. ఆయన ఔదార్యాన్నే తెలుపుతున్నది.

సహదేవుడు: అంతకంటె మిన్నగ ఆయన అవివేకాన్ని కూడా తెలుపుతున్నది!

ద్రౌపది : (చికాకుగా తన స్థానంలో నుంచి లేస్తూ) ఈ పూటకు మరి చాలు! - మీ సోదర నింద!

సహదేవుడు: నీకు కోపం రావడం సహజమే. వాదం పెరటి దారిని పట్టగానే కోపం సింహద్వారం గుండా ప్రవేశిస్తుంది.

ద్రౌపది : (సహదేవునికి ఎదురుగా వచ్చి నిలబడి) ఏమిటి? మీరు మహా చేస్తున్న వాదం! ఔదార్యాన్ని అవివేకమనడమా?

సహదేవుడు: చికాకు పడక, కాస్త శాంతంగా కూర్చుంటే, అదేమిటో నీకే తెలుస్తుంది. ఇలారా! కూర్చో! (ద్రౌపదిని తన ప్రక్కన కూర్చోబెట్టుకుని) ఎంత చెడ్డా దుర్యోధనుడు ధీరోదాత్తుడైనందున మన భీమసేనులతో గదాయుద్ధం చేస్తానన్నాడు. అలా కాక, యుధిష్ఠర ప్రభువులతో గదాయుద్ధ మన్నాడనుకో! దాని ఫలితం ఏమైపోయేదో నేను చెప్పాలా?

ద్రౌపది : దుర్యోధనుని నోటివెంట ఆమాటరాకపోవడం యుధిష్ఠరుల ధర్మప్రభావం వల్లనే!

సహదేవుడు: అంటే నీ తాత్పర్యం? "ఆయనలో వివేకం శూన్యమైనా, ఆయన ధర్మప్రభావం మనను రక్షిస్తోంది" అనేనా?

ద్రౌపది : నా తాత్పర్యం అది కాదు; ఆయన మీకంటె చాలా వివేకవంతులని!

సహదేవుడు: అయితే, మీ ధర్మప్రభువులు తమ వివేకాన్ని ప్రదర్శించిన ఒక సందర్భాన్ని దయచేసి వివరించండి - చూద్దాం!

ద్రౌపది : మీరు అడగ్గానే నాకు జ్ఞాపకం రావద్దా?

సహదేవుడు: ప్రయత్నించి జ్ఞాపకంచేసుకోవలసినంతిటి చెదురుగా వున్నాయి కాబోలు, ఆ సందర్భాలు!

ద్రౌపది : చెదురుగా ఖర్మమేమిటి? -కోకొల్లలుగానే వున్నాయి. ఒక క్షణంలో చెబుదా! (ఆలోచనలో పడి) అప్పుడు...

సహదేవుడు: ఎప్పుడు?

ద్రౌపది : ఆ! అప్పుడే... అలా తొందర పెడితే ఎలా?

సహదేవుడు: అయితే, ఈ లోగా ఆయన అవివేకానికి మరొక నిదర్శనాన్ని నన్ను చెప్పమంటావా?

ద్రౌపది : వద్దులెండి!

సహదేవుడు: ఏ! వినడానికి భయమా?

ద్రౌపది : నాకెందుకు భయం?

సహదేవుడు: ఆయన పట్ల నీ భక్తి గౌరవాలు ఎక్కడ దెబ్బ తినగలవో అని!

ద్రౌపది : అవి మీరనుకున్నంత సులభంగా దెబ్బతినవులెండి!

సహదేవుడు: అయితే, విను! మన రాజసూయయాగ సందర్భంలో దేశ దేశాల రాజులు మనకు ఇచ్చిన కప్పాన్ని, ప్రజలు తెచ్చిన కాన్కలను అందు కోడానికి మరెవ్వరూ దొరకనట్టు దుర్యోధనుని నియోగించడం శుద్ధ అవివేకం కాదా? అతడు అసూయాగ్రస్తుడని ఈయనకు తెలియదా? ఆ భాగ్యరాసులను చూస్తే అతడికి కన్ను కుడుతుందని తెలియదా? మన వినాశానికై అతడు మరింతగా తహ తహ లాడింది ఆ భాగ్య రాసులను చూసిన పిమ్మటనే కాదా? పోనీ, ఆ తర్వాతనైనా తక్కిన వారితో పాటు హస్తినాపురానికి దుర్యోధనుని తిరిగి వెళ్లనీయకుండా ఇంద్రప్రస్థంలో అతడిని ఎందుకు నిలిపినట్టు? మయసభా వైభవాన్ని చూచి, అతడు నిజంగా ఆనందిస్తాడనేనా? పైకి ఎంత నిరాడం బరులుగా కనబడినా, మీ ధర్మ ప్రభువులలో ఆడంబర ప్రియత్వం విశేషంగానే...

ద్రౌపది : సరే! మీరు ఆగండి!

సహదేవుడు: ఏ! ఎందుకు?

ద్రౌపది : ఆయన వివేకానికి తార్కాణం చెప్పమన్నారుగా! చెబుతా!

సహదేవుడు: సంతోషం - ఇప్పటికైనా నీ కొకటి తోచినందుకు! ఏమిటది?

ద్రౌపది : ప్రథమ ద్యూతం తర్వాత కౌరవసభకు ఏక వస్త్రనై నేనెందుకు వచ్చాను?

సహదేవుడు: అప్పుడు నీవు రజస్వలవు గనుక.

ద్రౌపది : అంతే మీకు తెలిసింది! ఏకవస్త్రంతో, అధోనీలితో, రోదిస్తూ కౌరవ సభకు రావలసిందిగా ధర్మప్రభువులు పరమ రహస్యంగా నాకు సందేశం పంపించారు.

సహదేవుడు: (విస్తుపోతూ) అలాగా! పరమ రహస్యంగా నీకు...

ద్రౌపది : (చిరునవ్వుతో) సందేశం పంపించారు!

సహదేవుడు: ఇంత పాడు పని ఆయనెందుకు సేయమన్నట్టు? నీ వెందుకు చేసినట్టు?

ద్రౌపది : ఇది పాడు పని కాదు; కౌరవుల తాడు తెంచిన పని. ఆయన మాటపై ఆ రీతిగా నేను రాబట్టే కదా ధృతరాష్ట్రుడు, ఆయన కుమారులు అంతగా అప్రతిష్ట పాలైంది!

సహదేవుడు: ఇప్పుడు నాకు తెలుస్తున్నది సంజయుడు మీ ధర్మ ప్రభువులను "మెత్తని పులి" అని ఎందుకన్నాడో!

ద్రౌపది : ఆ సూత పుత్రుని మాటలకేమిలెండి!

సహదేవుడు: క్షత్రియులుగా చెల్లుతున్నవారిలో చాలా మంది కంటె సూతపుత్రులే వివేకవంతులు, వారే ధీరోదాత్తులు.

ద్రౌపది : ఓహో! సూతపుత్రులంటే ఎప్పటునుంచి తమకు ఈ భక్తి గౌరవాలు?

సహదేవుడు: సూతపుత్రుడుగా ఈ గుడ్డి లోకం చులకన సేస్తూ పోయిన కర్ణుడే నిజంగా నాకు జ్యేష్ఠ సోదరుడని తెలుసుకొన్న నాటి నుంచి!

ద్రౌపది : (చిరునవ్వులో నుంచి చింతలోకి మారుతూ) ఆయనకు జరిగిన ఘోరాపచారానికి నిందించవలసింది లోకాన్ని కాదు మీ తల్లినే!

సహదేవుడు: ఆ నిందను నీవైనా కొంత పంచుకోవాలేమో!

ద్రౌపది : నేనా! ఎందుకు?

సహదేవుడు: మత్స్య యంత్రాన్ని కూలగొట్టడానికై ఆయన విల్లెక్కగా...

ద్రౌపది : అది నా తప్పు కాగు; మీ తల్లి తప్పే! మొన్న మొన్నటి వరకు నిజాన్ని ఆమె కప్పి పుచ్చిందయ్యే!

సహదేవుడు: (తల పంకిస్తూ) ఇంత కాలం నిజాన్ని ఆమె కప్పి పుచ్చి వుండకపోతే...

ద్రౌపది : కురుక్షేత్ర సంగ్రామమే తప్పేదేమో!

సహదేవుడు: నీకు పంచపతిత్వం కూడా తప్పేది. "సూతపుత్రుని చేబట్ట" నని నీవు తిరస్కరించి వుండకపోతే, ఆ ధనుర్విద్యాపారీణుడు మత్స్య యంత్రాన్ని ఛేదించి వుండేవాడే!

ద్రౌపది : (మనస్సు ఎక్కడికో పోయినట్టు) బహూశా!

సహదేవుడు: బహూశా కాదు. నిశ్చయమే. అన్నట్టు, ఒక పెద్ద అనుమానం నాకు చిరకాలంగా వున్నది సుమీ!

ద్రౌపది : ఏమిటది?

సహదేవుడు: నీ స్వయంవర సభలో ఆయన హీనకులజుడని నిరసిస్తూ నీవన్న మాటలు కలిగించిన బాధతో పాటు మరొకటి కూడా కర్ణుని చివర వరకు పీడించిందని!

ద్రౌపది : అదేమిటో సెలవివ్వండి!

సహదేవుడు: నిన్ను పత్నిగా పొందలేక పోతున్నానన్న బాధ!

ద్రౌపది : కొందరికి పరకాయ ప్రవేశ విద్య తెలిసినట్టు, తమకు పరహృదయ ప్రవేశ విద్య తెలుసుకాబోలు!

సహదేవుడు: ఆ విద్యా ప్రదర్శన మరి కొంత చేయమంటావా? కర్ణుని పతిగా పొందలేదన్న బాధ నీకైనా కొంత లేక పోలేదు!

ద్రౌపది : చాల్చాలు! మీ వివేకానికి చాలా సంతోషించాను!

దేవుడు: నీవు కాదన్నా నిజమంతే!

పది : ప్రతి కుసంకను ఒక పరమ సత్యంగా ప్రతిపాదించడమే తమ వివేకానికి నిదర్శనమా?

దేవుడు: నా మాటలో నిజం లేకపోతే నీవింత నిష్ఠూరంగా మాట్లాడవు!

పది : నా సపత్ని విజయకు గంగిగోవుకైనా వుండని సహనం వున్నదేమో! లేకపోతే, మీ నిత్య వివేక ప్రదర్శనను భరించడం ఆ కుద్ర రాజపుత్రికకు సాధ్యపడేదా?

దేవుడు: నీ వలె ప్రౌఢ కాదు గనక, మనస్సు ఎలా దాచుకోవాలో ఆమెకు తెలియదు.

పది : నేను మనస్సు దాచుకుంటున్నానా?

దేవుడు: అన్నదమ్ములలో కడసారివాడినైనందునే నా కెంత వివేకమున్నా, నేనెన్ని విద్యలు నేర్చినా, వాటికి రాణింపు లేకుండా పోతున్నదని నాకు పూర్తిగా తెలుసు. అయినా...

పది : వివేకినని చెప్పుకొనడం వివేక లక్షణమా?

హదేవుడు: చెప్పుకున్నా నాకు గుర్తింపు లేకుండా పోతున్నది లే!

పది : గుర్తింపు లేకపోవడమేమిటి? గోగణాలు తమ వివేక సంపదను గుర్తించబట్టే గాదా, తాము చెప్పినట్టు నడుచుకుంటాయి

హదేవుడు: ఔను! మానవుల కున్న జాడ్యం వాటికి లేదు.

పది : మీకు తెలుసో, లేదో, ఇలాంటి బాధ మీ నాల్గవ అన్నగారికి కూడా వున్నది. తన అందాన్ని చూచి, ధర్మప్రభువులు ఈర్ష్య పడతారట!

సహదేవుడు: ఈయన త్రిలోక సుందరుడని గుర్తిస్తే మీ ధర్మ ప్రభువులకు నష్టం లేదు. భీమార్జునులు జగదేక వీరులని గుర్తించినా, ఆయ నష్టమేమీ లేదు. వివేకినని నన్ను గుర్తిస్తే మాత్రం యుక్తా య విచక్షణపరులుగా, ధర్మాధర్మ నిర్ణేతలుగా తమకున్న విఖ్యాతి పోతుంది!

ద్రౌపది : మీకున్న ఈర్ష్యా దోషాన్ని ఆయనకు అంటగట్టడం దేనికి? మీ పరిపాలనా దక్షులని ఆయన మిమ్ము ఎన్ని సార్లు మెచ్చుకోలేదు

సహదేవుడు: ఇందుకే నిన్ను పోలిన ప్రౌఢ లేదని నేనడం! అయిదుగురు ప మధ్య అరమరలు రాకుండా కాపాడుకు రావడం నీకే తగు!

ద్రౌపది : (చిరునవ్వుతో) ఓహో!

సహదేవుడు: యిదుగురు పతుల ప్రేమను సమానంగా నిలుపుకొనడం నీకే సాధ్య

ద్రౌపది : ఓహో!

సహదేవుడు: అయిదుగురు పతుల ద్వారా అభీష్ట కార్య సాధన సైతం నీకే చెల్ల

ద్రౌపది : ఓహోహో!

సహదేవుడు: నీ "ఓహోలు" నా వివేకానికి జోహారులు!

ద్రౌపది : నిజంగా మీరు వివేకవంతులైతే మీ కోపాన్ని ఈ శిల్పాలపై చూపిం వారా? ఆ తాంబూలం పళ్లెరాన్ని ఇంత సేపటిగా కన్నెత్తి చూ కుండా వుండేవారా? లేచి దాన్ని అందుకోండి! (సహదేవుడు లే వెళ్లి, తాంబూలం పళ్లెరాన్ని తెచ్చి, దగ్గరగా పెడతాడు)

ద్రౌపది : ప్రియమెరిగిన పతి ఈనెలు తీసి, సున్నం రాసి, ఆకు మడుపులన పతి నోటికి అందిస్తాడని వివేక వంతునికి చెప్పనక్కర లేదేమో (సహదేవుడు తమలపాకులందుకొని, ఈనెలు తీస్తుండగా - తెర)

...న్న ద్రౌపది ప్రమిద

...క్తి తైలం ... న వత్తిని సరిచేసి, కలశాన్ని ఒక ప్రక్కగా వుంచి, వెనుకకు వచ్చి, ధర్మరాజు పాదాలవద్ద భక్తితో కూర్చుంటుంది.

ద్రౌపది: రామాయణ పారాయణానికి అంతరాయం కలిగింది. తమకు శ్రమ కాక పోతే, ఆ పుణ్యకథాశ్రవణ భాగ్యాన్ని మరి కొంతసేపు కలిగించండి. రెండు నెలలనాడు ప్రారంభించినా, ఇంకా అయోధ్యా కాండలోనే ఉన్నాము.

ధర్మరాజు: నీకు నిద్రాసమయమైన దేమో!

ద్రౌపది: లేదు, స్వామి! లేదు! పౌరాణిక గాథలను తాము శ్రావ్యంగా చదివి, వాటిలోని ధర్మసూక్ష్మాలను వివరిస్తుంటే, నాకు తన్మయత్వం కలుగుతూ వుంటుంది!

ధర్మరాజు: తన్మయత్వం వల్లనే కాబోలు, ఇంతకు ముందు కునికి పాట్లు పడ్డావు!

ద్రౌపది: కునికిపాట్లు పడింది నేను కాదు; ఆ దీపం!

ధర్మరాజు: అయితే, ఆవలించింది కూడా ఆ దీపస్తంభం కాబోలు!

ద్రౌపది: (నవ్వి) కథ మంచి పట్టులో వున్నది. (తమ మధ్య ఒక చిన్న బల్లపై తెరచిన పుటలతో వున్న భూర్జరపత్రగ్రంధ సంపుట మెత్తి, దాన్ని ధర్మరాజు వాడిలో పెడుతూ) మధ్యలో నిలపడం తమకు భావ్యం కాదు.

ధర్మరాజు: (పుస్తకాన్ని చేతులలోకి తీసుకుంటూ) తిరిగి ఎక్కడ మొదలు పెట్టాలి?

ద్రౌపది: ఎక్కడ నిలిపారో తమకు తెలియదా?

ధర్మరాజు: చదవడం నేనెక్కడ నిలిపానో నాకు తెలుసు. కాని, వినడం నీవెక్కడ నిలిపావో అది నాకెలా తెలుస్తుంది!

ద్రౌపది: (తిరిగి నవ్వి) వనవాసానిక ... రాలైన సీత ఆయనను నిందావాక్యాలు పలుకనారంభించిన ఘ... వరకు వచ్చాము.

ధర్మరాజు: పోనీ, దాన్ని రేపు చదువుకోరాదా? అది బాధాకరమైన ఘట్టం!

ద్రౌపది: ఎవరికి బాధాకరం? రామునికా? తమకా?

ధర్మరాజు: ఉభయులకు! (ఈసారి ద్రౌపది మరింత బిగ్గరగా నవ్వుతుంది. ధర్మ రాజు చిరునవ్వు నవ్వుతాడు.)

ద్రౌపది: (గ్రంథ పఠనానికి ధర్మరాజు తిరిగి ఉపక్రమించబోతుండగా) అక్షరాలి ప్పుడు స్పష్టంగా కనపడుతున్నవా?

ధర్మరాజు: ఓ! దివ్యంగా! దీపమిప్పుడు కునికిపాట్లు పడ్డం లేదు, దీపస్తంభమిప్పుడు ఆవలించడం లేదు!

ద్రౌపది: (నవ్వి) నవ్వులలోకి దించి, మరి ఈ పూటకు చదవకుండా సరిపె ట్టాలని చూస్తున్నారు!

ధర్మరాజు: నవ్వే నీకు శోభ!

ద్రౌపది : (మ్లానవదనంతో) ఏమి శోభో! అదే మన క్షోభలన్నింటికీ మూలం! మయసభలో దుర్యోధనుని పాట్లు చూచి మీదమ్ములతో పాటు నేను కూడా నవ్వబట్టే కాదా కురుక్షేత్ర సంగ్రామం అనివార్యమైంది!

ధర్మరాజు: ఇంతలో నవ్వు, అంతలో కన్నీరు, ఇంతలో ఆగ్రహం, అంతలో అను గ్రహం - హావభావ విలాసాలలోని ఈ చంచలత్వమే స్త్రీ జాతికి శోభ!

ద్రౌపది: (చిరునవ్వుతో) అయితే, పురుషజాతికి ఏది శోభ తెస్తుందో నన్ను చెప్పమంటారా?

ధర్మరాజు: నా అనుమతి కోరడం దేనికి? చెప్పు!

AOUA10UB124

ప్రతులకు :

న్యూ స్టూడెంట్ బుక్ సెంటర్
ఏలూరురోడ్, విజయవాడ -520 002

రూ. 15/-

BC

# మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

| | |
|---|---|
| పుస్తకం సంఖ్య | AOUA104B124 |
| పుస్తకం పేరు | ద్రౌపది |
| తారీఖు | 31 December 2025 |
| ముందు అట్ట | YES |
| వెనుక అట్ట | YES |
| మొత్తం పేజీలు | 71 |
| పెద్ద సైజు పేజీలు | NO |
| ఖాళీ పేజీలు | 2, I ,bci |
| లేని పేజీలు | 1,2, No |
| తయారు చేసినది | P Jayamma |
| పేజీలు విడదీసినది | P Jayamma |
| స్కాన్ చేసినది | Lavanya |
| పరీక్ష చేసినది | anusha |
| పేజీలు పరిచూసినది | |
| బైండింగు చేసినది | |
| ప్యాకింగు చేసినది | |
| పరిస్థితి | good |